J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 41 సంచిక : 43 1.4.2022, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

### ఏప్రిల్ 4 నుండి..

## చిన్నదైపోతున్న నెల్లూరు




మొలగొలుకులు మొలిచిన జిల్లా... మొనగాళ్లకు నెలవైన ఖిల్లా నెల్లూరు. చైతన్యవంతమైన రాజకీయ ఉద్దండులకు జన్మనిచ్చిన నేల నెల్లూరు. ఉద్యమాల పురిటిగడ్డ నెల్లూరు. సంగీత, సాహిత్య, సాంస్కృతిక, కళారంగాల నిలయం నెల్లూరు. అపర దానకర్ణులు పురుడు పోసుకున్న పుణ్యభూమి నెల్లూరు. అలాంటి నెల్లూరుజిల్లా ఏప్రిల్ 4వతేది నుండి చిన్నదైపోతోంది. ఉన్నవి పోగా.. కొత్తవి కలుపుకోగా 46 మండలాలకుగానూ ఇప్పుడు 38 మండలాలు మాత్రమే మిగిలాయి. 4 రెవెన్యూ డివిజన్లు ఏర్పడ్డాయి. జిల్లాలో కొత్తగా కలిసిన కందుకూరు నియోజకవర్గాన్ని కూడా రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించారు. దీంతో నెల్లూరు, ఆత్మకూరు, కావలితో కందుకూరు కూడా జతకట్టి 4 రెవెన్యూ డివిజన్లుగా అవతరించాయి.

పునర్విభజన ప్రక్రియలో అనేక మార్పులు చేశారు. కొన్నిచోట్ల ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్నారు. నేతల సూచనలు, సలహాలకి ప్రాధాన్యతనిచ్చారు. అంతర్జాతీయ రాకెట్ కేంద్రం షార్, ప్రత్యేక వాణిజ్య మండలి శ్రీసిటీ,

10 లో

### మరో బాంబు పేలింది...

## సామాన్యుడి కరెంటుబిల్లు పెరిగింది



మరో బాంబు పేలింది. ఏప్రిల్ 2న 'ఉగాది పండుగ'.. అంటూ సంబరపడిపోతున్న ప్రజలకు కరెంట్ 'షాక్' కొట్టింది. ఒకవైపు పెట్రో ధరల మోత.. మరోవైపు గ్యాస్‌బండ వాత. ఈ బాధలు తట్టుకోలేక సామాన్యులు ఇప్పటికే చావలేక బతుకుతుంటే.. మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్టుగా.. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కసారిగా.. భారీగా కరెంటు చార్జీలను పెంచేయడంతో వాటి దెబ్బకి జనం అల్లాడిపోతున్నారు. ఇక బాదుడే బాదుడు!.. పేదలు, సామాన్యులే కాదు.. కరెంటు వాడుకునే అన్నివర్గాల ప్రజలకు.. ఈ వాతలు తప్పవు. ఈసారైనా సంతోషంగా ఉగాది పండుగ జరుపుకుందామనుకునేవారికి ఆదిలోనే హంసపాదన్నట్లుగా ఉగాది రోజుల్లోనే ఇలాంటి చేదువార్తలు తప్పడం లేదు. ఈఏడాది కూడా ప్రజలకు ఏమాత్రం కలిసివచ్చేట్లు కనిపించడం లేదు. ఈ 'శుభకృత్' ఉగాది కూడా.. 'క్షోభ కృత్' అయ్యేట్లుంది. అందులో ఈ మండే ఎండాకాలంలో కరెంటు చార్జీలు పెరగడం ఇందులో కొసమెరుపు!...

10 లో




## శ్రీకీర్తికి కిరీటం..?

### గౌతమ్ సతీమణికి మంత్రి పదవి

### రేసులో ప్రసన్న, కాకాణి

10 లో



వైసిపి నాయకుల గుండెల్లో గుబులు మొదలైంది. ఏప్రిల్ 11న మంత్రివర్గ విస్తరణ ఉంటుందనే వార్తలు రాగానే ఎవరి జాతకం ఎలా ఉండబోతోందోననే ఉత్కంఠ రేగుతోంది.






3 లో

## నందమూరి పార్టీకి నలభై ఏళ్ళు!



### సంబరాలలో తెలుగు తమ్ముళ్ళు

### పార్టీ పటిష్టతపై వీడని చిక్కుముళ్ళు

'సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్ళు..' అన్న నినాదంతో దివంగత నందమూరి తారకరామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించి 40 ఏళ్ళు అయ్యింది. కులతత్వ పోరాటాలకు తెలుగు రాష్ట్రాల్లో తెరలేచి 4 దశాబ్దాలు నిండాయి.






### గౌతమ్ నాకు చిరకాలమిత్రుడు..

## నా కోసమే నాయకుడయ్యాడు

### సంతాప సభలో సీఎం



ఫిబ్రవరి 21వ తేదీ హఠాన్మరణం చెందిన రాష్ట్రమంత్రి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి రాజకీయ వారసుడు గౌతమ్ సంతాప సభ మార్చి 28వతేదీ నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొనడం కోసం ప్రత్యేకంగా తాడేపల్లి నుండి నెల్లూరొచ్చిన సీఎం జగన్ భావోద్వేగంతో ప్రసంగించారు. గౌతమ్ తనకు చిన్నప్పటినుండి మంచి స్నేహితుడని, ఎన్నో విషయాలలో మంచి చెడులు సూచించేవాడని సీఎం అన్నారు. ప్రతిభ కలిగిన వ్యాపారవేత్తగా పేరు గడించిన గౌతమ్ కేవలం తన పిలుపుమేరకు రాజకీయాలలోకి వచ్చాడని చెప్పారు. తన కోసమే నాయకుడయ్యాడని అన్నారు. తాను రావడమే కాకుండా సీనియర్ రాజకీయవేత్తగా ఉన్న తన తండ్రి రాజమోహన్‌రెడ్డిని కూడా తనకు మద్దతుగా తీసుకొచ్చి స్నేహధర్మాన్ని పాటించాడని జగన్ చెప్పారు. గౌతమ్ ఈరోజు మనమధ్య లేడన్న నిజాన్ని నమ్మలేకున్నానని, ఇలాంటి సభలో పాల్గొనవలసిరావడం అత్యంత బాధాకరంగా ఉందని అంటూ ఎంతో ఉద్వేగానికిలోనయ్యారు. వ్యక్తిగతంగా, ప్రభుత్వపరంగా తనకు గౌతమ్ లేని లోటు ఎవ్వరూ పూడ్చలేరని అన్నారు. తనకు అప్పజెప్పిన బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహించడం కోసం నిరంతరం శ్రమించేవాడని, రాష్ట్రానికి పరిశ్రమలను తేవడం కోసం తపించేవాడని అన్నారు. మరణించడానికి

10 లో



## సంకీర్తన గానాలతో..
# అన్నమయ్య ఆరాధన

అన్నమయ్య వర్ధంతి సందర్భంగా గతనెల 29న ఫాల్గుణ బహుళ ద్వాదశి రోజున నెల్లూరులోని ప్రముఖ కర్నాటక సంగీత విద్వాంసురాలు దుర్భా రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో పలువురు సంగీత కళాకారులు ఎంతో భక్తిశ్రద్ధలతో అన్నమయ్య ఆరాధన నిర్వహించారు. అన్నమయ్య సంకీర్తనలను శ్రవణానందకరంగా ఆలపించి అందరినీ ఆకట్టుకున్నారు. 'అభీష్ట వరద శ్రీ మహా గణపతే', 'ఈడగు పెండ్లి', 'లక్ష్మీకల్యాణము'..తదితర అన్నమయ్య రచించిన కల్యాణ కీర్తనలను హృద్యంగా గానం చేసి అందరి అభినందనలు అందుకున్నారు. రాయప్రోలు సుబ్బారావు, వేదవ్యాస పాయ్‌లు వయొలిన్, ఈశ్వరపాయ్ మృదంగ వాద్యా నాదాలు ఈ సంకీర్తన గానాలను మరింతగా వీనులవిందు చేశాయి. దుర్భా జనార్ధన్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక భిక్షాటనా పూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవ సభ కార్యదర్శి డా.వై నాగదేవి ప్రసాద్, కోశాధికారి నాగేశ్వర్, కార్యవర్గ సభ్యులు దుర్భా మురళీ కృష్ణ, వి.ఆర్.సి విశ్రాంత ప్రిన్సిపాల్ డా.ఎం.సుబ్రహ్మణ్యం, గట్టుపల్లి శ్రీనివాస మురళీకృష్ణ, వివిఎస్ రామానుజాచారి పాల్గొన్నారు.

## శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి
# హుండీ ఆదాయం 19.28 లక్షలు

నెల్లూరు దర్గామిట్టలో కొలువైవున్న శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి ఇటీవల 19.28 లక్షల రూపాయల దాకా హుండీ రాబడి వచ్చింది. జనవరి 11 నుంచి మార్చి 25వ తేదీ వరకు భక్తులు సమర్పించిన కానుకలు లెక్కవేయగా మొత్తం 19,28,960 రూపాయలు వచ్చిందని, 20 అమెరికన్ డాలర్లను కూడా భక్తులు అమ్మవారికి సమర్పించివున్నారని ఆలయవర్గాలు తెలిపాయి.

# మంగళకర ఉగాది



మంచు తెరలు విడిపోవగా
మల్లె మొగ్గలు గుభాళింపగా
మళ్ళీ మళ్ళీ అరుదెంచుతున్నది ఉగాది
మాటవినిన మామిడి కొమ్మ చిగురింపగా
మహదానందంగా ఆ చిగురులు మేసిన కోయిల
మనోహర రాగాలను ఆలపింపగా
మరలిపోతున్న ప్లవనామ వత్సరం
మనస్ సాక్షిగా శ్రీ శుభకృతికి ఆహ్వానం పలికే.

మంచి చెడులు కష్టసుఖాలను
మహి తనలో పదిలంగా దాచుకోగలనన్న
మనవిని వీనులవిందుగా విన్న ఆమని
మిత్రులతో జతకలపగా
మరి ఇంకేల జాప్యమని

మామిడి తోరణాలను ఇంటింట
ముంగిట గుమ్మానికి అలంకరింపబడివున్నవని
ముదమారగ గమనించిన శుభకృతి
మానవాళికి షడ్రుచుల మేళవింపుల
మహా ప్రసాదాన్ని ఆరగింపగా సంతసించి
మంగళకర పంచాంగ శ్రవణం
మనోరంజకమని
మున్ముందు మహోపకారానికి
మిక్కుటముగా
మేలు చేయగలనన్నది
మంగళకర ఉగాది
తన ఆగమనముతో..



**దూబగుంట రామకృష్ణ**
తిరుపతి. 9652021126.

## రామాయణం..
# మానవాళికి ఆదర్శం


సత్కారాన్నందుకుంటున్న కోట రాజశేఖర్

ధర్మమూర్తిగా, ధర్మ పరిపాలకు నిగా జగతిలో ఎన లేని ఖ్యాతిగాంచిన శ్రీరామచంద్రుని చరిత్రే శ్రీమద్రా మాయణమని, రాముడు దేవుడే అయినా లోక కల్యాణం కోసం మానవుడుగా అవతరించి సత్యధర్మాలను ఆచరించి అందరికీ పూజనీయుడ య్యాడని, అందుకే రామాయణం సకల మానవాళికీ ఆదర్శమని ప్రముఖ అవధాని కోట రాజశేఖర్ అన్నారు. అన్ని గ్రంథాల్లోకెల్లా రామాయణం ఉత్తమోత్తమమైన గ్రంథం కనుక ప్రపంచంలో ఉన్న అన్ని భాషల్లోకి రామాయణం అనువదించబడిందని ఆయన అన్నారు. పద్య సారస్వత పరిషత్ – నెల్లూరుజిల్లా శాఖ వారి ఆధ్వర్యంలో స్థానిక బాలాజీనగర్‌లో ఉన్న శ్రీ సీతారామ మందిరంలో గత నెల 24న ప్రారంభమైన 'శ్రీమద్రామాయణ సప్తాహం'లో ఆయన పాల్గొని ప్రసంగించారు. రామాయణంలోని 'బాలకాండ'లో ఉన్న ఘట్టాలను చక్కగా విశదీకరించారు. సీతారామ కల్యాణఘట్టాన్ని కన్నులకు కట్టినట్లు వివరించారు. ఇనమడుగు శ్రీ సత్యానందాశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీ శ్రీహరి తీర్థస్వామీజీ వారి అనుగ్రహభాషణంతో సభ ప్రారంభమైంది. ఆలయ కమిటీ అధ్యక్షులు అమర్తలూరు వెంకటేశ్వర్లు గుప్తా, వివేకానంద విద్యాలయం అధినేత బొమ్మిశెట్టి యలమందయ్య, ప్రపంచ తెలుగు సమాఖ్య నెల్లూరు రీజియన్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడు, పరిషత్ అధ్యక్షులు పోలవరపు లక్ష్మీ నరసింహారావు పాల్గొని తమ సందేశాలనిచ్చారు. డా.చీమకుర్తి వెంకటేశ్వరరావు సభను నిర్వహించారు. ఆలయ అర్చకులు దాశరథి అవధాని రాజశేఖర్‌ను వేదమంత్ర పురస్సరంగా ఆశీర్వ దించగా, ఆలయ పాలకవర్గం, పరిషత్ సభ్యులు ఘనంగా సత్క రించారు. కురుచేటి రామారావు, భారతీదేవి సభా పోషకులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి పండితులు సూరం శ్రీనివాసులు, ఊరుబిండి వెంకటసుబ్రహ్మణ్యశాస్త్రి, తంగి రాల వేంకట నరసింహకుమార్, కెవిస్ దండపాణి పాల్గొన్నారు.

# రైతుల్ని నిలువునా దోచేస్తున్న మిల్లర్లు
## సిపిఐ నాయకుల ఆందోళన

జిల్లాలో రైతులు ఆరుగాలం కష్టించి ధాన్యం పండిస్తే రైస్ మిల్లర్లు, దళారులు ఇదే అదనుగా వారి కష్టాన్నంతా దోచుకుం టున్నారని, గిట్టుబాటు ధర ఇవ్వకుండా పుట్టి ధాన్యానికి 13 వేలు ఇస్తున్నారని, ఇదెక్కడి న్యాయమని సిపిఐ జిల్లా నాయకుడు దామా అంకయ్య, రైతు సంఘం నాయకుడు బలిజేపల్లి వెంకటేశ్వర్లు ఆందోళన వ్యక్తం చేశారు. గతనెల 27న కావలిలోని జర్నలిస్ట్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో ఈ సీజన్‌లో రైతులు సుమారు 7లక్షల ఎకరాల్లో ధాన్యం పండించారని, సుమారు 21 లక్షల మెట్రిక్ టన్నుల దాకా ధాన్యాన్ని ఉత్పత్తి చేసినా కొనే నాథుడు లేక రైతులు నానా యాతనలు పడుతున్నారని, ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని సక్రమంగా కొనడం లేదని, అధికారపార్టీ నాయకులు మిల్లర్లతో కుమ్మక్కై ధాన్యాన్ని తక్కువ ధరతో కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. తరుగు పేరుతో రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారని, కోట్లాదిరూపాయలను ఇలా రైతుల నుంచి దోచుకుం టున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ఈ పరిస్థితి గమనించి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నిఘా పెట్టి ఈ దోపిడీని అరికట్టాలని వారు కోరారు.

# ఉపాధ్యాయిని పట్ల అసభ్య ప్రవర్తన

- **పొదలకూరు ఎంఇఓ సస్పెండ్**

పొదలకూరు మండలం వావింటపర్తిలో ఓ పాఠశాల ఉపాధ్యాయిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంఇఓ బాలకృష్ణా రెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. ఆయన్ను విధుల నుంచి తొలగిస్తూ గుంటూరు ఆర్‌జెడి సుబ్బారావు గతనెల 28న ఆదేశాలిచ్చారు. ఆరోపణలను ప్రాథమికంగా విచారించిన అనంతరం ఎంఇఓను సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది.

వీక్షణం 47 - మంజీరారెడ్డి

## ఉగాదికి
# శుభ స్వాగతం!



ఉగాది వస్తోంది. కొత్త యుగానికి ఆదిగా అనాదిగా వస్తోంది ఉగాది. అనాదిగా వస్తోన్న ఉగాదికీ ఈ ఏడాది వస్తోన్న ఉగాది పూర్తిగా భిన్నం. రెండేళ్లుగా అందరి నాలుక మీద నాట్యం చేసిన రెండు పదాలు కరోనా, కోవిడ్‌లు కాల గర్భంలో కలుపుకుంటూ వస్తోంది. ఉక్రెయిన్–రష్యా యుద్ధం ఇక వినిపించని రోజులను తీసుకుని రావాలని ఆశిద్దాం. కష్టాల కడలి విప్లవం'గా దాటుకుని వస్తోంది ఈ ఉగాది.

చెట్టు తొర్రలో నుంచి భయంభయంగా తల బయటపెట్టి చూస్తున్న కుందేలు పిల్లలా గడిచింది రెండేళ్లుగా మనిషి జీవనం. అడవిలో పచ్చిక మైదానాల్లో స్వేచ్ఛగా చెంగుచెంగున విహరించే జింక పిల్లలా మారాలి ఈ ఏడాది. ఉగాదికి పాపాయికి పట్టు పావడా కుట్టించాలని తపనపడిన నాయనమ్మ, పాపాయి పట్టు పావడాలో బుట్ట బొమ్మలా ఇల్లంతా కలియ తిరగాలని ముచ్చటపడిన తాతయ్యలు రెండు ఉగాదులను నిరామయంగా గడిపేశారు. షాపు నుంచి పావడాతోపాటు కరోనా కూడా ఇంటికి వస్తుందేమోననే భయం. టైలర్ మెషీన్ పావడా కుచ్చులతోపాటు బోర్డర్‌గా కోవిడ్‌ను కుట్టి పంపిస్తోందేమోననే ఆందోళన. రెండు వ్యాక్సిన్‌లు, మాస్కు లతో కరోనా కడలిని దాటించింది ప్లవ. శుభాలను ఆస్వాదించమని వీడ్కోలు పలుకు తోంది ప్లవ. కరోనాతో సాగిన యుద్ధంలో మనిషిని గెలిపించడానికి దాతృత్వం ఉన్న వాళ్లు జనానికి ఫ్రీగా మాస్కులు పంచారు. ఫ్రీ మాస్కులు సరే, మాస్క్ ఫ్రీ రోజులు ఎప్పుడు వస్తాయో? అనుకుంటూ ముక్కును బంధించి ఊపిరి పీల్చుకున్నారు జనం.

*****

### డిజీ యుగం

ఆఫ్‌లైన్ జీవితం కాస్తా ఆన్‌లైన్ బతుకుగా మారిపోయింది. బిజీలైఫ్ కాస్తా డిజిటల్ యుగంలో డిజీ యుగంగా మారింది. నగరాలు పలచబడ్డాయి. గ్రామాలు మనిషి కళను సంతరించుకున్నాయి. కానీ జీవకళ మాత్రం లోపించింది. నగరాలు గ్రామాలనే తేడా లేకుండా అంతటా ఒకే భయం. బతుకుభయం. బతుకుతామో లేదోనన్న భయం.

*****

'మా చిన్నాన్న ఆరోగ్యం క్షీణించింది' ఉపోద్ఘాతం అక్కరలేకుండా విషయాన్ని వెలిబుచ్చాడో భర్త.

'చూడడానికి వెళ్తున్నారా' స్వరంలో ఏ భావమూ పలకనివ్వకుండా జాగ్రత్త పడడానికి ప్రయత్నిస్తోంది భార్య.

'కరోనా కాదులే, వయసు రీత్యా బలహీన పడ్డాడంతే' భార్య ఆందోళన గ్రహించి ఆమెను సమాధాన పరిచే ప్రయత్నం.

'నన్ను ఎత్తి పెంచిన చిన్నాన్న, మంచాన ఉంటే చూడకుండా ఎలా ఉండగలను' భావోద్వేగం.

కళ్ల ముందు ఎన్నెన్ని మరణాలో, చెవుల్లో మోగిన మరణాలకైతే లెక్కేలేదు. తెలిసిన వాళ్లు, తెలియని వాళ్లు.

రోజూ వాట్సాప్‌లో వచ్చే ఓ 'గుడ్ మార్నింగ్' ఉన్నట్లుండి ఆగిపోతుంది. ఆగిపోయింది గుడ్ మార్నింగ్ మెసేజ్ కాదు అభిమానం కురిపించే ఓ గుండె.

*****

ఏ మధ్య రాత్రో ఫోన్‌కాల్...

వణికే చేతుల్తో ఎవరా అని చూస్తే కజిన్ బ్రదర్ నుంచి ఫోన్. గుండె దడదడలాడుతుంది. ఏదో సందేహం, నిజం కాకూడదనే చిరు ఆశ.

సందేహమే నిజం. పెదనాన్న భూమాత గర్భంలో దాక్కోవాలని నిర్ణయించు కున్నాడు. తనకిక కరోనా భయం లేదన్నాడు. కొన్నాళ్లకు కరోనా కంటికి కనిపించకుండా పోతుంది, పోయిన పెదనాన్న మళ్లీ రావాలి కదా! కానీ ఇక రాడు.

*****

ఇంటి ముందు గులాబీ చెట్టు పూసిన ఎర్రటి గులాబీని కోసి దోసిట్లో అపురూపంగా చూసుకుంటోంది ఓ చెల్లి. 'జడలో పెట్టుకోవాలనిపించిందేమో... వారించడానికి మనసు రాక చూస్తుండిపోయింది తల్లి. ఎదురుగా ఫొటోలో నవ్వుతున్న భర్త ఫొటోకి పెట్టిందా పువ్వుని. 'మన చెట్టు పూసిన పువ్వు, ఇప్పటి వరకు నా కోసం పూసింది. ఇక నుంచి నీ కోసం పూస్తుంది. నేను జడలో పెట్టుకున్న పువ్వు నాకు కనిపించదు. నువ్వు ఆ పువ్వుని ఇష్టంగా చూస్తుండేవాడివి. ఇప్పుడు నీ ఫొటోకి పెట్టిన పువ్వుని రోజంతా ఇష్టంగా చూస్తూ ఉంటాను' అనుకుంది మనసులో.

*****

'అమ్మా! నా కోసం ఎదురు చూడడం నీకిష్టం కదా! పండక్కి వస్తానని ఎదురు చూస్తుంటారు నాన్న, నువ్వు. మళ్లీ రాబోయే పండక్కి ఈ పండగ నుంచే ఎదురు చూసేదానివి. ఈసారి ఎందుకిలా! నేను రాకముందే వెళ్లిపోయావెందుకమ్మా' అని తల్లి ఫొటోను అడిగే కొడుకుకు సమాధానం చల్లటి చిరునవ్వే.

*****

ఇంట్లో తిరిగిన మనుషులను గోడ మీద ఫొటోలుగా మార్చిన ఏడాదికి వీడ్కోలు. ఆత్మీయులను బరువైన జ్ఞాపకాలుగా మిగిల్చిన సంవత్సరాలు ఇక రావద్దు.

'నో కరోనా... నో మాస్క్' అని మానవాళిని ఆశీర్వదించాలి శుభకృత్. ఆన్‌లైన్ జీవనాలు ఆఫ్‌లైన్‌కు మారాలి. టీచర్లు పిల్లల చేతిని పట్టుకుని అక్షరాలు దిద్దించాలి. వీడియో కాల్ పలకరింపులు ఇక చాలు. బాల్యం చిరు బుకు రైలెక్కి అమ్మమ్మ దగ్గరకు వెళ్లాలి, తాతయ్య భుజాలనెక్కి విహరించాలి. శుభకృత్ ఇలాంటి శుభకరమైన క్రతువులన్నింటినీ తీసుకురావాలి. శుభకృతులతో శోభాయమానంగా సాగాలి ఈ ఏడాది. అందుకే!.. పలుకుదాం.. ఈ ఉగాదికి శుభస్వాగతం!...

## నారా వారు లాగేసుకున్న...

# నందమూరి పార్టీకి నలభై ఏళ్ళు



- కుల విభజన విష వృక్షానికి 4 దశాబ్దాలు
- సంబరాలు చేసుకుంటున్న తెలుగు తమ్ముళ్ళు
- పార్టీ పటిష్టతపై వీడని చిక్కుముళ్ళు

**1982.** చదరంగంలో ఆ పావును తీసి ఈ పావును పెట్టినట్టుగా ఆంధ్ర ప్రదేశ్‌లో కాంగ్రెస్ ముఖ్యమంత్రుల్ని ఇందిరాగాంధీ తన ఇష్టారాజ్యంగా తెల్ల వారేసరికి మార్చేస్తూ వినోదిస్తున్న రోజులు అవి. కాంగ్రెస్ అధిష్టానం వికృత రాజకీయ క్రీడా విన్యాసానికి విసిగిపోయి... ప్రత్యా మ్నాయం కోసం కాంగ్రెస్ వ్యతిరేక శక్తులు చకోర పక్షుల్లా ఎదురుచూస్తున్న కాలం అది. సినిమాల్లో సహాయ పాత్రధారుల స్థాయికి కుదించుకుపోయిన కాంగ్రెసేతర రాజ కీయ పార్టీలు, సిపిఐ, సిపిఎం, బీజేపీలు... కాంగ్రెస్ దాష్టికాలను గుడ్లప్పగించి చూస్తున్న దినాలు అవి. ఎటుజూసినా రాజకీయ ప్రత్యామ్నాయం కోసం ఆవు రావురుమంటూ జనం ఎదురు చూస్తున్న తరుణం అది.

కాంగ్రెస్ అంటే 'రెడ్లు' అనే భావం తెలుగునాట స్థిరపడిపోయింది. కానీ, అది సమాజంలో కుల విభజనకు దారి తీయ లేదు. 1956లో తెలుగు రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి... ముఖ్యమంత్రులుగా నీలం సంజీవరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి, కోట్ల విజయభాస్కరరెడ్డి, టంగుటూరి అంజయ్య, నేదురుమల్లి జనార్ధనరెడ్డి, మర్రి చెన్నారెడ్డి, భవనం వెంకట్రామ్‌రెడ్డి.... ఇంత మంది రెడ్డి ప్రభువులా అంటూ ఒక సామాజిక వర్గం లోలోపలే కుతకుతలాడిపోతున్నా, కాంగ్రెస్‌ను ఢీ కొనగలిగిన వీరుడు అప్పటి దాకా కనిపించలేదు.

చెన్నారెడ్డి మంత్రివర్గంలో ఆర్థిక, వాణిజ్య పన్నుల శాఖ మంత్రిగా అన్నీ తానై చక్రం తిప్పి నెంబర్ 2గా చలామణి అవుతుండిన నాదెండ్ల భాస్కరరావుతో విబే ధాలు రావడంతో చెన్నారెడ్డి, నాదెండ్లను తోక కత్తిరించి తూనికలు కొలతల శాఖకు పరిమితం చేశారు. అప్పుడే ఆయన మైండ్‌లో ఓ ప్రత్యామ్నాయానికి బీజం పడింది. కాంగ్రెస్‌పార్టీని, ప్రభుత్వాలను ఫుట్‌బాల్ ఆడుకోవడం అనే ఎడిటోరి యల్ పాలసీతో ఇంటింటి పేరుగా మారిపోయిన ఈనాడు యజమాని రామోజీరావు కూడా ఆ తరుణంలో కాంగ్రెస్‌ను ఓడించగల మగధీరుడి కోసం 'వెదుకులాట'లో ఉన్నారు...

## రామారావు పార్టీకి బీజం

నిజానికి అప్పటివరకు.. అంటే 1982 వరకు న్యూస్‌పేపర్ చదవడం కూడా అలవాటు లేని ఎన్‌టి రామారావు, గుంటూరు ఏసీ కాలేజీలో తన సహా ధ్యాయి అయిన భవనం వెంకట్రామ్‌రెడ్డి సీఎంగా ప్రమాణస్వీకారం సభకు రాజ్ భవన్‌కు వచ్చారు. రాజకీయ నాయకులకు ఉండే 'పవరు..., లెవెలు' చూసి ఆయనకు ఆశ్చర్యమేసింది. అక్కడే ఆయన రాజకీయ అరంగేట్రానికి బీజం పడింది.

ఇటు, నాదెండ్ల భాస్కరరావు, ఈనాడు రామోజీరావుకు కూడా 'ప్రత్యామ్నాయం దొరికేసింది. ఎంతసేపూ రెడ్డి రాజులేనా అన్న అంతర్గత ఆవేదనకూ జవాబు దొరికింది. సముద్రంలోని ఉప్పు, చెట్టుమీద కాయ కలిశాయి. గాలికి నిప్పు తోడైంది. అప్పటివరకు రాజకీయాధికారం అనేది కాంగ్రెస్‌లో లభించని కమ్మ సామాజిక వర్గం సంఘటితమైంది. ఈ పరిస్థితుల న్నింటి నేపథ్యంలో నందమూరివారి నయా పార్టీ 'తెలుగుదేశం' ఆవిర్భవించింది.

తెరమీద 'నటుడు' ఒక్కరే జనానికి కనబడతారు. కానీ, తెరవెనుక వందల మంది నిపుణులు దర్శకుడి సారధ్యంలో పనిచేసే రీతిలో ఎన్‌టి రామారావును రాజకీయ తెరపైకి తెచ్చారు.

అదే 1982 మార్చి 29. ఎన్టీఆర్ ప్రకటించిన పార్టీ పేరే తెలుగుదేశం. ఒక సామాజికవర్గం సంఘటిత, సమన్వయ, సమిష్టి కృషి, వ్యూహ... ప్రతి వ్యూహాల ఫలితంగా ఎన్టీఆర్ కేవలం 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చారు. దీన్ని మరోలా చెప్పాలంటే ఆయన చేత పార్టీ ప్రకటింప చేసిన 9 నెలల్లో శాసనసభకు ఎన్నికలు వచ్చాయి. కాంగ్రెస్‌తో విసిగి వేసారిన జనం ఎన్‌టి రామారావును అక్కున చేర్చుకున్నారు.

నిజానికి, అప్పటివరకు తెలుగు సమా జంలో కుల భావనలను జనం పట్టించుకో లేదు. ఎన్‌టీ రామారావు ముఖ్యమంత్రి అయ్యేవరకూ జనానికి ఆయన గురించిన కనీస కులస్పృహ కూడాలేదు. అంతమంది రెడ్డి నేతలు ముఖ్యమంత్రులుగా ఎది గినా... కుల భావనలు చోటుచేసుకో లేదు. దామోదరం సంజీవయ్య, భవనం వెంకట్రామ్, జలగం వెంగళరావు, పీవీ నరసింహారావు వంటి నేతలు ముఖ్యమం త్రులుగా వచ్చినప్పటికీ వారి వారి కులా లను పట్టించుకున్న వారు లేరు.

కానీ, తెలుగుదేశం గెలిచేవరకు సమా జంలో లేని కుల ప్రస్తావన ఆ పార్టీ అధికా రంలోకి వచ్చిన తరువాత ఒక్కసారిగా గుప్పుమంది. ఎన్టీఆర్ మంత్రివర్గంలో మంత్రిగా పనిచేసి, రాజీనామా చేసిన ముద్రగడ పద్మనాభం ఒక ప్రముఖ దిన పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇలా చెప్పారు... "ఎన్టీఆర్‌లో కులపిచ్చిని దగ్గరి నుంచి చూశాను. ఆశ్చర్యం వేసేది. ఒక కమ్మకు, మరొకరికి మధ్య వివాదం తలెత్తి ఆ విషయంలో తీర్పు చెప్పాల్సి వస్తే... "ఆయన కమ్మ వ్యక్తి తరఫున నిలబడేవారు. ఇద్దరూ కమ్మవారే అయితే వారిద్దరిలో ఎవరు పెద్దకమ్మ అయితే వారికి అను కూలంగా ఉండేవారు". ఈ కులతత్వం ఆయన హయాంలో మొక్కలాగా మొదలై, పెరిగి పెద్దదై... మానై... ఇప్పుడు అడ యారు మర్రివృక్షం అంత అయింది. దాని ఊడలు శాఖోప శాఖలుగా ఉమ్మడి ఆంధ్ర సమాజంలో ప్రతిమూలకూ విస్తరించాయి.

## మామ నుండి లాగేసుకుని

సమాజానికి తెలుగుదేశం చేసిన ఈ 'మహోపకారా'నికి 40 ఏళ్ళు అని చెప్ప వచ్చని అంటారు సామాజిక విశ్లేషకులు. మొదటి పన్నెండేళ్ళు ఎన్టీఆర్ దీనికి నీరు పోసి పెంచి మహావృక్షాన్ని చేస్తే.... 1994లో మామ నుండి ఆ వృక్షాన్ని లాగేసుకుని 28ఏళ్ళ నుండి దాని నీడలో కాలం గడిపేస్తున్నాడు చంద్రబాబు నాయుడు. ఆయన చేతికి పగ్గాలు వచ్చి నప్పటి నుండీ ప్రభుత్వంలోనూ బయటా కుల కోణమే గీటురాయి అయిపోయింది.

కుల కల్మషం అంటే ఏమిటో తెలి యని ముద్రగడ పద్మనాభం తెలుగుదేశం పుణ్యమా అని ఇప్పుడు 'కాపు నేత' అవ తారం ఎత్తారు. ఆ కోణంలోనే చిరంజీవి ప్రజారాజ్యం అనే పార్టీని తెరమీదకు తెచ్చారు. ఇప్పుడు పవన్‌కళ్యాణ్ రాజ కీయానికీ అదే ఆలంబన. తెలుగుదేశం పార్టీకి వెన్నెముకగా నిలిచిన కమ్మ సామా జికవర్గంలో అత్యధిక శాతం పిల్లలు, పెద్దలు, వృద్ధులు, మగవారు, స్త్రీలు మొదలైనవారితో ఒక స్థిరమైన ఓటు బ్యాంకు ఏర్పడింది. ఒక బలమైన క్యాడర్ కూడా తయారయ్యింది. బీసీలను వీరికి జతచేశారు. దాంతో టీడీపీ అంటే కమ్మ, బీసీల పార్టీ అనే భావనకు కూడా 40 ఏళ్ళు అని చెప్పవచ్చు.

కాంగ్రెస్‌కు ప్రత్యామ్నయంగా ఒక పార్టీ అని రామోజీరావు, నాదెండ్ల భాస్కర రావు ఆలోచించినప్పుడు గానీ, ఎన్‌టి రామారావు 1982 మార్చి29న పార్టీని ప్రకటించినప్పుడు గానీ చంద్రబాబు నాయుడు ఆ చుట్టుపక్కల ఎక్కడా కనుచూపు మేరలో లేరు. రాజశేఖరరెడ్డి పుణ్యమా అని అంజయ్య మంత్రివర్గంలో క్రీడల శాఖ మంత్రిగా ఉన్నారు. 1983లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చంద్రగిరి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా... తెలుగుదేశం అభ్యర్థిపై పోటీచేశారు. పార్టీ అనుమ తిస్తే, ఎన్‌టి రామారావుపైనే పోటీకి సిద్ధమని ప్రకటించారు. కాంగ్రెస్‌పార్టీకి పూర్తి విధేయత ప్రకటించారు. చివరకు ఓడిపోయారు.

మరోవైపు ఎన్‌టి రామారావు ఆధ్వ ర్యంలో 'తెలుగుదేశం' అనే రాజకీయ సినిమా సూపర్ హిట్ అయింది. దాంతో, చంద్రబాబునాయుడు భూమ్యాకాశాలు ఏకం చేసి, రామారావును ఉక్కిరిబిక్కిరి చేసి 'టీడీపీ ప్రవేశం' చేశారు.

ఇక అప్పటినుంచి తెలుగుదేశం పార్టీలో చంద్రబాబు హవానే ఈ పూటకూ కొనసాగుతూ వస్తోంది. తెలుగువారి ఆత్మ గౌరవం కోసం టీడీపీని స్థాపించారంటూ లౌడ్ స్పీకర్లు ఊదరగొట్టినా చంద్రబాబు నాయుడు రాజకీయ భవిష్యత్ కోసమే ఆయన పార్టీ పెట్టినట్టుందని ఇప్పటికీ పలువురు విమర్శకులు వ్యాఖ్యాని స్తుంటారు.

## కుల వేదికల ఆవిర్భావం

తెలుగుదేశం ఆవిర్భావం తరువాతే కాపునాడు, బీసీనాడు, మాలనాడు, మాదిగనాడు, రెడ్డినాడు.. అంటూ సమాజం ముక్కలు చెక్కలుగా విడిపోయింది. ఈ సమాజ పతనానికి 40 ఏళ్ళు.

తెలుగుదేశం ఓడిపోయినా... కుల విభజన అంతర్ధానం కావడం లేదు కదా! దాని మానాన అది పెరుగుతూనే ఉంది. పెరుగుతూనే ఉంటుంది. భవిష్యత్‌లో ఈ మహమ్మారి సమాజాన్ని ఎటు దీసుకు వెడుతుందో అంటూ సామాజిక శ్రేయోభి లాషులు భయపడుతున్నారు. అందుకే... పచ్చని సమాజంలో చిచ్చుపెట్టిన తెలుగు దేశం పార్టీకి 40 ఏళ్ళు వచ్చాయి.

## సంబరాలు చేసుకుంటున్న తెలుగు తమ్ముళ్ళు..

## పార్టీ పటిష్టతపై వీడని చిక్కుముళ్ళు!

తమ పార్టీకి నలభై సంవత్సరాలు నిండాయని తెలుగు తమ్ముళ్ళు సంబరాలు చేసుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు బయట రాష్ట్రాలలో కూడా ఉత్సవాలు చేసుకుని స్వీట్లు పంచుకుంటున్నారు. పార్టీ కోసం పునరంకితమవుతాం... అంటూ సామూహిక శపథం చేస్తున్నారు. మళ్ళీ తమ పార్టీని అధికా రంలోకి తెచ్చేవరకు విశ్రమించబోము అంటూ ప్రతినబూను తున్నారు. కానీ ఇక్కడ వారి ముందున్న సవాలు ఒక్కటే... తమ భవిష్యత్ నాయకుడెవరు...? తమని ముందుకి నడిపించే యువశక్తి ఎవరు...??

రాష్ట్రం రెండు ముక్కలైన తరువాత 2014లో విభజ నాంధ్రలో తొలిసారిగా జరిగిన ఎన్నికలలో బాబుకు పట్టం కట్టారు ఆంధ్రా ఓటర్లు. సీనియర్ అన్న ఆశతో, అనాదాంధ్రని ఆయన స్వర్ణాంధ్రగా మారుస్తారన్న నమ్మకంతో అధికారం ఇచ్చారు. కానీ ఆయన ఏమాత్రం మారలేదు, అదే కులపిచ్చితో అమరావతిని రాజధానిగా ప్రకటించారు. తన సామాజికవర్గానికి మేలుచేయాలన్న ఒకే ఒక లక్ష్యంతో అనాదాంధ్రని ఆగాదాంధ్రగా మార్చేశారు. తన వారసుడిని అందలం ఎక్కించాలన్న తపనతో పూర్తిగా అబాసుపాలయ్యారు. బాబు కొడుకుల విధానాలతో విసుగెత్తిన జనం ఆయనను ఓడించి ఇంటికి పంపించారు.

ఇప్పుడు మళ్ళీ పార్టీని అధికారంలోకి తేవాలని తెలుగు తమ్ముళ్ళు ఉబలాట పడుతున్నారు. తమ ప్రస్తుత నాయకుడికి చరిష్మా లేదు, ఆయన వారసుడికి పార్టీని నడిపించే సమర్ధత లేదు. అలాంటప్పుడు కొత్త రక్తాన్ని తెరపైకి తేవాలి. ఆ రక్తం నందమూరి కుటుంబానిదై ఉండాలి. అది ఎవరు...? వేచి చూడాల్సిందే...!

లాయర్
విజయపథంలో నెల్లూరీయులు




కాఫీటేబుల్ బుక్ కొరకు
9246431984 నెంబరుకు
గూగుల్‌పే GPay లేదా PhonePe ఫోన్‌పే
ద్వారా రూ.1,000/- (వెయ్యి రూపాయలు)
పంపించి పొందవచ్చును.
వాట్సాప్ ద్వారా మీ ఫోన్ నెంబరు,
చిరునామా తెలియజేస్తే..
కొరియర్ / ర్యాపిడో ద్వారా మీకు పంపిస్తాం.



- మేనేజర్, సర్కులేషన్

నెల్లూరు, మాగుంట లే అవుట్‌లోని లాయర్ పత్రిక కార్యాలయం నందు కూడా పొందవచ్చును.

లాయర్
ఏప్రిల్ 01, 2022

# ఈశాన్యం..కొంత ప్రశాంతం

**ఎంతోకాలం నుంచి వివాదాలతో అల్లకల్లోలంగా ఉన్న అసోం- మేఘాలయ రాష్ట్రాల సరిహద్దు సమస్యలకు దాదాపు యాభై ఏళ్ల తర్వాత ఇప్పుడైనా కొంతమేరకు పరిష్కారం జరగడం ఎంతైనా సంతోషించదగ్గ విషయం. ప్రధాని నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి ఇలాంటి దీర్ఘకాలపు సమస్యల పరిష్కారానికి కృషి చేయడం శుభపరిణామం. కేంద్రహోంమంత్రి అమిత్‌షా ఆధ్వర్యంలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో జరిగిన తాజా సమావేశంలో పలు సమస్యలకు పరిష్కారం లభించడంతో ఈశాన్యంలో ప్రశాంతతకు మార్గం వేసినట్లయింది.**

ఎట్టకేలకు దాదాపు యాభైఏళ్ళ వివాదానికి తెరపడింది. ఈశాన్యం కొంత ప్రశాంతమైంది. దేశంలో ఎంతోకాలం నుంచి గొడవలు, వివాదాలతో అల్లకల్లోలంగా ఉన్న అసోం-మేఘాలయ రాష్ట్రాల సరిహద్దు సమస్యలకు ఇన్నాళ్ళకు.. ఇన్నేళ్ళకైనా కొంతమేరకు పరిష్కారం జరగడం ఎంతైనా సంతోషించదగ్గ విషయం. ప్రధాని నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి ఇలాంటి దీర్ఘకాలపు సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటుండడం వల్ల జటిలమైన సమస్యలు కూడా ఒక కొలిక్కి వస్తున్నాయి. సంయమనం, సానుకూల దృక్పథం ఉండాలే గానీ సామరస్యపూర్వక వాతావరణంలో చర్చించుకుంటే ఎంత కఠినమైన సమస్యలకైనా పరిష్కారం దొరుకుతుందనే విషయం అనేక సందర్భాల్లో రుజువైంది. ఇప్పుడు కూడా జరిగిందిదే. బంగ్లాదేశ్‌తో మనదేశ సరిహద్దు వివాదాన్ని కూడా సున్నితంగానే పరిష్కరించిన మోడీ, తాజాగా దేశంలోని రెండు ఈశాన్య రాష్ట్రాల మధ్య సయోధ్యను సునాయాసంగానే సాధించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆధ్వర్యంలో అసోం ముఖ్యమంత్రి బిశ్వశర్మ, మేఘాలయ సిఎం కొన్రాడ్ సంగ్మాలతో గతనెల 29న సమావేశం కావడం, అన్ని విషయాలను సుదీర్ఘంగా చర్చించి ఇరుపక్షాలను సమ్మతింపజేసి ముఖ్యమైన సరిహద్దు సమస్యను తీర్చడం మంచి పరిణామం!.. చరిత్రాత్మకం కూడా!..

అసోం-మేఘాలయల మధ్య సరిహద్దు వివాదంతో గత యాభైఏళ్ళుగా ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి. 2014లో చెలరేగిన అల్లర్లలో 14 మంది మృతిచెందడం, 2014లో రెండు రాష్ట్రాల పోలీసుకాల్పుల్లో వందమంది దాకా ప్రాణాలు కోల్పోవడం వంటి ఘటనలు దేశప్రజలను కలవరపెట్టాయి. అసోం నుంచి 1971లో విడిపోయి మేఘాలయ కొత్తరాష్ట్రంగా ఏర్పడింది. రెండు రాష్ట్రాల మధ్య సుమారు 885 కిలోమీటర్ల సరిహద్దు ఉంది. ఇదే ఇప్పటిదాకా పెద్దసమస్యగా ఉండేది. అక్కడున్న కొన్ని ప్రాంతాలు తమకు చెందినవే అయినా వాటిని అసోంలోనే ఉంచారని మేఘాలయ అంటే, ఆ ప్రాంతాలు తమకు చెందినవేనన్నది అసోం వాదన. దీంతో వివాదాలు మొదలయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇలాంటి క్లిష్టమైన సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో ఏళ్ళతరబడి సరిహద్దు వివాదాల అగ్గి రాజుకుంటూనే ఉండేది. వాస్తవానికి మేఘాలయ, మిజోరం, మణిపూర్, నాగాలాండ్ ఒకప్పుడు అసోంలో ఉండేవే. ఆయా రాష్ట్రాల్లో సరిహద్దు సమస్యలేవీ ఇప్పటివి కాదు..అప్పట్లో బ్రిటీష్‌వాళ్ల పాలనలోనే పలు రాష్ట్రాల ప్రజల మధ్య అగ్ని రాజేసి ఆజ్యం పోస్తుండే వారు. స్వాతంత్ర్యం వచ్చాక కూడా ఆ ఘర్షణలు అలాగే కొనసాగుతుండేవి. ఈ వివాదాలను అలుసుగా తీసుకుని అదే అదనుగా తీవ్రవాదులు కూడా ఆ రాష్ట్రాల్లో జొరబడి మరింత అశాంతిని సృష్టించేవారు. ఇలా ఎంతకాలం ఈ వివాదాలు రావణ కాష్టంలా కాలుతున్నా ఏళ్ళతరబడిగా కాంగ్రెస్ పాలనలో ఎప్పుడూ అలాంటి సమస్యలను నివారించేందుకు ప్రయత్నాలు జరిగేవి కాదు. గొడవలు జరిగితే బడితెలతో బాదడం తప్ప సమస్యలు ఎందుకొస్తున్నాయన్నది విచారించే నాథులుండేవారు కాదు. దీంతో ఆయారాష్ట్రాల ప్రజల బాధలు వర్ణనాతీతంగా ఉండేవి. ఈ నేపథ్యంలో ఇటీవలే కేంద్ర ప్రభుత్వం సామరస్యంగా సమస్యలు పరిష్కరిస్తుండడం చెప్పుకోదగ్గ విషయం. ఇదేవిధంగా నాగాలాండ్ వివాదాన్ని కూడా కేంద్రం పరిష్కరించింది. అరాచకాలకు పాల్పడుతున్న తీవ్రవాదులకు..వారి స్థావరాలకు స్థానం లేకుండా చేయడం జరిగింది. ఏదేమైతేనేం ఇప్పుడు అసోం-మేఘాలయ సమస్యలు కూడా పరిష్కారం దిశలోకి రావడం హర్షదాయకం. అందుకు మోడీ, అమిత్‌షాలతో పాటు ఆ రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా సంయమనంతో వ్యవహరించి సానుకూలంగా స్పందించడం విశేషం. ముఖ్యమంత్రులిద్దరూ అంగీకరించడంతో వివాదాలకు సంబంధించిన 12 అంశాల్లో ఆరింటికి ఇప్పుడు పరిష్కారం లభించినట్లయింది. దీంతో ఈశాన్యంలో కొంత ప్రశాంతత చేకూరినట్లయింది. ఇదేవిధంగా మరి కొన్నిసార్లు చర్చించుకుంటే మిగిలినవి కూడా ఒక దారికి వస్తాయి. కేంద్రం ఆ చొరవను కొనసాగించాలి. వివాదాలు, గొడవలతో ఈ రెండు రాష్ట్రాలే కాదు ఈశాన్య రాష్ట్రాలన్నీ ఎంతోకాలంగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటున్నాయి. వాటిని పురోగతి బాటలో పెట్టి..అక్కడి ప్రజలకు ప్రగతి ఫలాలను అందించేందుకు కూడా కేంద్రప్రభుత్వం మరింతగా ముందుకు రావాలి. సమస్యలు తీర్చి ప్రజల అభివృద్ధికి బాటలు వేసినప్పుడే ఇంతటి కృషికి సార్థకత లభిస్తుంది.

## నియంత్రణ లేని ఆటోలు..!



నెల్లూరు నగరంలో ఆటోల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. ఎక్కడ పడితే అక్కడ రోడ్డుపైన అడ్డంగా ఆపేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే తగవుకి వస్తున్నారు. షేర్ ఆటోల సంప్రదాయం వచ్చినప్పటినుండి ఈ అడ్డంగా ఆపే విధానం మరీ ఎక్కువైపోయింది. ఆటో కెపాసిటీకి మించి ప్యాసింజర్లు ఎక్కేవరకూ రోడ్డులో అడ్డంగా పెట్టి ముందుకి వెనక్కి కదులుతుంటారు తప్ప

### సమస్యల తో 'రణం'

బయలుదేరరు. ట్రాఫిక్‌కి అంతరాయం కలుగుతుందన్న కనీస స్పృహ కూడా వీళ్ళకి ఉండదు. గట్టిగా మాట్లాడితే ఇంకో ఆటో చూసుకోమంటారు. ఈ ఆటో వాలాలకి ఇంత ధైర్యం రావడానికి, తమ ఇష్టమొచ్చినట్లు ప్రవర్తించడానికి ఒక విధంగా ఖాకీలే కారణం. తమిళనాట 90శాతం ఆటోలు పోలీసుశాఖకు చెందినవాళ్ళవే ఉంటాయి. అందుకే అక్కడ ఆటో డ్రైవర్లు ఎవరికీ భయపడరు. అదే సంస్కృతి నెల్లూరుజిల్లాలో కూడా వచ్చింది. నగరంలో తిరిగే ఆటోలు ఎక్కువ భాగం పోలీసువారు నడిపేవే, అందుకే ఆటోవాలాలకి ప్రజలంటే గౌరవం లేదు, పోలీసంటే భయంలేదు. ఉన్నతాధికారులు కొంచెం దృష్టిపెట్టి వీరి ఆగడాలను నియంత్రిస్తే బాగుంటుందని ఆటో ప్రయాణికులు కోరుకుంటున్నారు.

-సంచారి

## కవులకు 'పెరసం' ఉగాది పురస్కారాలు



ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పలువురు కవులు, కవయిత్రులకు నెల్లూరులోని పెన్నా రచయితల సంఘం (పెరసం) ప్రధానకార్యదర్శి అవ్వారు శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో గతనెల 27న స్థానిక టౌన్‌హాలు రీడింగ్‌రూమ్‌లో ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. పురస్కారాలు అందుకున్నవారిలో ప్రముఖ అవధాని కోట రాజశేఖర్, ప్రముఖ కవి చిన్ని నారాయణరావు, కవయిత్రులు ములుగు లక్ష్మీమైథిలి, అనూరాధా రామకృష్ణ ఉన్నారు. తోట చెంచులక్ష్మమ్మ- గురుమూర్తిల జ్ఞాపకార్థం వారి కుమార్తె కవయిత్రి తోట సులోచన ఈ పురస్కారాలు అందజేశారు. సాహితీవేత్త మెట్టు రామచంద్రప్రసాద్, సర్వేపల్లి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు సర్వేపల్లి రామమూర్తి చేతుల మీదుగా పురస్కారాలు ప్రదానం చేశారు. పెరసం గౌరవాధ్యక్షులు గంగిశెట్టి శివకుమార్ ఈ సందర్భంగా మర్రిపాడుకు చెందిన ప్రముఖ చరిత్రకారుడు, పరిశోధకుడు డా. శివశంకర్‌కు ఘనసన్మానం చేశారు. పెరసం అధ్యక్షులు మోపూరు పెంచలనరసింహం, గోవిందరాజు సుభద్రాదేవి, ఇంద్రగంటి మధుసూదన్, కారుమంచి నాగేంద్ర, హస్తి లక్ష్మణరాజు, బొగ్గరపు రాధాకృష్ణ, ఇందిర, స్వాతి, శేషమ్మ, అరుణ, పేరిశెట్ల శివకుమార్, ఐనకోట రవికుమార్, అంకబాబు తదితరులు పాల్గొన్నారు.

## నయనానందకరం.. నరసింహస్వామి కల్యాణం



నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహ కొండపై వెలసివున్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో గతనెల 27న స్వామివారి కల్యాణోత్సవం నయనానందకరంగా జరిగింది. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీనృసింహస్వామి వారు సర్వాలంకారశోభితులై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు తొలుత స్వామివారు-అమ్మవార్లను పూలమాలలతో అలంకరించి ప్రత్యేకపూజలు చేసిన తర్వాత కల్యాణం నిర్వహించారు. అనంతరం 'గిరి ప్రదక్షిణ' ఉత్సవంలోనూ పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఛైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఇఓ గిరికృష్ణ తదితరులు పర్యవేక్షించారు.

### ముగిసిన బడ్జెట్ సమావేశాలు

## అక్కడ నవ్వులు - ఇక్కడ నిప్పులు

రెండు తెలుగు రాష్ట్రాలలో తాజాగా అసెంబ్లీ సమావేశాలు ముగిశాయి. తెలంగాణలో 119 సీట్లకుగాను 103 సీట్లను కైవసం చేసుకుని తెలంగాణ రాష్ట్ర సమితి అధికారంలో ఉంది. ఆంధ్రాలో 175 సీట్లకుగాను 151 స్థానాల్లో విజయ ఢంకా మోగించి వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ పవర్లోకి వచ్చింది. కానీ పరిపాలనలో ఈ ఇద్దరు ముఖ్యమంత్రులలో స్పష్టమైన తేడా కనపడుతోంది. కొత్త రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణలో 2014లో అధికారంలోకి వచ్చిన కల్వకుంట్ల చంద్రశేఖరరావు తన రాజకీయ అనుభవాన్నంతా పరిపాలనపై ప్రయోగించి మంచి పాలకుడిగా పేరు తెచ్చుకున్నాడు. ఆరు నెలల ముందే ఎన్నికలకు వెళ్ళి, మళ్ళీ అధికారపగ్గాలు చేపట్టాడు. చిన్న చిన్న వ్యతిరేకతలు, ప్రతిపక్ష పార్టీల విమర్శలు, ప్రభుత్వ ఉద్యోగుల సమ్మె బెదిరింపులు వంటివి ఉన్నా అన్నిటినీ తనదైన తరహాలో అధిగమిస్తూ వస్తున్నాడు. తమ ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఎవరూ కోర్టు మెట్లు ఎక్కకుండా సమస్యలను పరిష్కరించుకుంటున్నాడు. మరి ఎందుకనో ఆంధ్రాలో ఆలా జరగడంలేదు. జనామోద ముఖ్యమంత్రిగా అధికారం చేజిక్కించుకున్న జగన్‌మోహనరెడ్డి జనరంజక పాలకుడనిపించుకోలేక పోతున్నాడు. వందల సంఖ్యలో కోర్టు కేసులు, ఉద్యోగులలో వ్యతిరేకత వంటి అంశాలతో పాటు అనేక సమస్యలను నెత్తిమీదకు తెచ్చుకుని సమతమవుతున్నాడు. తాను అధికారం




లోకి వచ్చిననాటి నుండి ఒక్కరోజు కూడా ప్రశాంతంగా ఉన్నట్లు కనపడడంలేదు. ఇటీవల రెండు రాష్ట్రాలలోనూ బడ్జెట్ సమావేశాలు జరిగితే తెలంగాణ అసెంబ్లీ ఛలోక్తులతో నవ్వులతో సాగి ముగిసింది. ఆంధ్ర శాసనసభలో మాత్రం ఉన్న అతి తక్కువ మంది ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వంపై నిప్పులు కురిపించారు. అస్తమానం జగన్‌మోహన్‌రెడ్డిని కీర్తిస్తూ ఆయన సహచరులు అతి అల్ప, స్వల్ప ప్రతిపక్ష సభ్యుల నోర్లు మూయించలేకపోతున్నారు. అందుకే అక్కడ నవ్వులు - ఇక్కడ నిప్పులు.

*యం. చంద్రమౌళి*, కొత్త ఢిల్లీ.

## రేసింగులు అదుపు చెయ్యలేరా..?

ఇటీవలి కాలంలో నెల్లూరు నగరంలోని పలు ప్రాంతాలలో రేసింగులు ఎక్కువయ్యాయి. ముఖ్యంగా శివారు ప్రాంతాలలో ఆదివారం, పండుగలు వంటి సెలవు దినాల్లో ఈ రేసింగులు ఎక్కువగా జరుగుతున్నాయి. 18 నుండి 22 ఏళ్ళ మధ్య ఉన్న యువకులే రేసింగులలో పాల్గొంటున్నారు. మరోవైపు మోటారుసైకిళ్ళకు సైలెన్సర్లు పీకేసి చెవులు మోతమోగే శబ్దం చేస్తూ నగర నడిబొడ్డులో తిరగడం కూడా తెగ ఫ్యాషనైపోయింది. ఈ కుర్రకారులో ఎక్కువమంది రాజకీయ నాయకుల పిల్లలో లేక వారి బంధువులు, అనుచరుల పిల్లలో ఉండడం వల్ల... వాళ్ళకి పోలీసులంటే భయం కూడా లేదు. సైలెన్సర్ లేని బండి కనిపించినా, రేసింగులు తమ దృష్టికి వచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ పలుమార్లు ప్రకటించారు. కానీ, ఆయన క్రిందిస్థాయి సిబ్బంది మాత్రం పెద్దోళ్ళ పిల్లలతో వ్యవహారం మనకెందుకొచ్చిందిలే అన్నట్లుగా వినీ విననట్టు, చూసీ చూడనట్టు ఉంటున్నారు. ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగినప్పుడు మాత్రం హడావుడి చేసి చేతులు దులిపేసుకుంటున్నారు. కొద్దిరోజులు గడిస్తే మళ్ళీ షరామామూలే..! గతంలో అనేకమంది ప్రముఖుల పిల్లలు ఇలా రేసింగులలో అశువులు బాసిన అనుభవాలు మనకున్నా, మార్పు మాత్రం రావడం లేదు. ప్రముఖ భారతీయ క్రికెట్ క్రీడాకారుడు అజారుద్దీన్, సినీనటుడు బాబూమోహన్ లాంటి వారు తమ వారసులను కోల్పోయింది ఈ రేసింగుల పుణ్యమే! ఈ రేసింగుల ప్రహసనానికి ఫుల్‌స్టాప్ పడాలంటే ఎక్కడో ఒక చోట మళ్ళీ ఒక ప్రాణం బలికావలసిందేనా ...?

*కే. లక్ష్మీస్రవంతి*, భక్తవత్సలనగర్, నెల్లూరు.

# నెల్లూరు రింగ్‌రోడ్డుకు గ్రీన్ సిగ్నల్

## - ఎంపీ ఆదాలకు ముఖ్యమంత్రి హామీ



నెల్లూరుజిల్లాలో పలు రోడ్ల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వాటిలో ప్రధానంగా నెల్లూరు రింగ్‌రోడ్డు, మైపాడు నుంచి కొత్తకోడూరు బీచ్‌రోడ్డుకు సిఎం ఆమోదం తెలిపారు. ఇటీవల నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిలు సిఎంను అసెంబ్లీలోని సిఎం చాంబర్‌లో కలిశారు. జిల్లాలో పలు రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు కోరుతూ సిఎంకు వినతిపత్రం అందజేశారు. అందుకు సిఎం సానుకూలంగా స్పందించారని, అందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారని వారు పేర్కొన్నారు. ఆత్మకూరు- ఉదయగిరి రోడ్డులను కూడా అభివృద్ధి చేయాలని వారు కోరారు. ఆ తర్వాత నెల్లూరు జిల్లా రాజకీయాలపై చర్చ జరిగింది. ముఖ్యంగా ఉదయగిరి అభివృద్ధి కోసం స్థానిక ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి పనిచేయాలని, ఆ ప్రాంత ప్రజల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీ ఆదాలకు సిఎం సూచించగా, అందుకు తన సహకారం తప్పకుండా అందిస్తామని ఎంపీ ఆదాల తెలిపారు.

# సిజిహెచ్‌ఎస్ కావాలి

## పార్లమెంట్‌లో మాగుంట శీనయ్య



ప్రకాశం జిల్లాలో కేంద్రప్రభుత్వ ఆరోగ్య సేవల వ్యవస్థ (సిజిహెచ్‌ఎస్)ను ప్రారంభించాలని వైఎస్సార్సీపి నేత, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. గతనెల 30న పార్లమెంట్‌లో ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో కేంద్రప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు పెద్దసంఖ్యలో ఉన్నారని, వెల్‌నెస్ సెంటర్ లేక వారెంతో అవస్తలు పడుతున్నారని పేర్కొన్నారు. ఆ విషయమై తాను కేంద్ర ఆరోగ్యశాఖకు ఇప్పటికే లేఖ రాసి ఉన్నానని కూడా చెప్పారు.

# విజయాభినందనలు




భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యదర్శి, నెల్లూరు దత్తపుత్రుడు వై.సత్యకుమార్‌ని 'లాయర్' సంపాదకులు శివప్రభాత్‌రెడ్డి హైదరాబాద్‌లో కలిశారు. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఎన్నికలలో పార్టీ విజయఢంకా మోగించడంలో సత్యకుమార్ చేసిన కృషిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా 'లాయర్' నలభై వసంతాల ప్రత్యేకసంచిక 'విజయపథంలో నెల్లూరీయులు' కాఫీటేబుల్ బుక్‌ని సత్యకి అందజేశారు.

# బాగున్నావా డాక్టర్...



ఇటీవల శాసనసభలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో శాసనమండలి సభ్యులు బల్లి కళ్యాణ్‌చక్రవర్తి, ఆయన సతీమణి తిరుమల తిరుపతి దేవస్థానాల వైద్య ఆరోగ్య సలహాదారు డాక్టర్ శ్వేత సీఎం జగన్‌ని కలిశారు. బల్లి దంపతులను చూసిన ముఖ్యమంత్రి బాగున్నావా డాక్టర్!... అంటూ శ్వేతని పలకరించి 'అల్ ది బెస్ట్!' అంటూ ఆశీర్వదించారు.

# మన సతీష్‌రెడ్డికి మరో అపూర్వ గౌరవం

## జెఎన్‌టియు నుంచి ఏప్రిల్11న డాక్టరేట్ ప్రదానం



***భారత దేశానికి విశేషమైన సేవలందిస్తూ, భారత రక్షణ రంగ వ్యవస్థలో తనదంటూ ప్రత్యేక ప్రతిభాపాటవాలతో రాణిస్తున్న నెల్లూరీయుడు, మన సతీష్‌రెడ్డికి గౌరవ డాక్టరేట్ లభించనుంది. రక్షణరంగలో మెరుపులు మెరిపించే క్షిపణుల ప్రయోగాలతో డిఆర్‌డిఓకు ఎనలేని విఖ్యాతిని తెస్తున్న సతీష్‌రెడ్డి కీర్తికిరీటంలో ఈ గౌరవ డాక్టరేట్ మరో కలికితురాయి కానుంది.***

భారత రక్షణ రంగంలో విశేషమైన ఎంతో విశిష్టమైన సేవలందిస్తున్న డా. సతీష్‌రెడ్డికి జెఎన్‌టియు నుంచి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయనున్నారు. రక్షణ రంగ వ్యవస్థకు మరింత పదును పెడుతూ నాగ్, రుద్రం, బిఎండి, క్యూఆర్‌ఎస్‌ఎం, లాంగ్‌రేంజ్ గైడెడ్ బాంబ్, ఆకాష్ వంటి అస్త్రశస్త్రాలతో రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్న భారత రక్షణ, పరిశోధనల అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఓ) ఛైర్మెన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డికి ఇది మరో అపూర్వమైన పురస్కారం. ఏప్రిల్ 11న జరిగే అనంతపురంలోని జెఎన్‌టియు స్నాతకోత్సవంలో ఆయన ఆ గౌరవాన్ని అందుకోనున్నారు. రాష్ట్ర గవర్నర్, యూనివర్శిటీ చాన్సలర్ విశ్వభూషణ్ హరిచందన్ అందుకు ఇటీవల ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇస్రో ఛైర్మెన్ డాక్టర్ ఎస్.సోమనాథ్, విశిష్ట అతిథిగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలపుస సురేష్ పాల్గొననున్నారు.

డా.సతీష్‌రెడ్డి జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాలలో 1980-84 బ్యాచ్‌లో బీటెక్ (ఇసిఇ) చదివి, 1986లో డిఫెన్స్ రీసెర్చి సెంటర్‌లో చేరారు. అంచలంచెలుగా ఎదుగుతూ 2015లో రక్షణ మంత్రిత్వశాఖ సాంకేతిక సలహాదారుగా నియమితులయ్యారు. 2018లో డిఆర్‌డిఓ ఛైర్మెన్‌గా కూడా అత్యున్నతమైన, అత్యంత బాధ్యతాయుతమైన పదవిని పొందారు. ఆ రెండు పదవులను ఆయన సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు కూడా.

రక్షణ రంగంలో అపూర్వమైన సేవలందిస్తున్న డా.సతీష్‌రెడ్డి 2014లో 'ఉత్తమ శాస్త్రవేత్త' అవార్డును కూడా అందుకుని ఉన్నారు. గత ఏడాది శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నుంచి ఆయన గౌరవ డాక్టరేట్‌ను పొందారు. ఇప్పుడు జెఎన్‌టియు వారు కూడా ఆయన్ను అభినందిస్తూ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయనుండడం విశేషం.




# సిఎన్‌జి గ్యాస్‌ను వినియోగించుకోవాలి

## - కలెక్టర్ చక్రధర్‌బాబు




జిల్లాలోని వాహనదారులంతా సిఎన్‌జి గ్యాస్ వాడకం పట్ల అవగాహన పెంచుకుని, వాహనాలకు దానిని విరివిగా ఉపయోగించుకోవాలని, తద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటునందించాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు సూచించారు. గతనెల 30న అట్లాంటిక్ గల్ఫ్, పసిఫిక్ (ప్రథం) కంపెనీవారు నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ సిఎన్‌జి గ్యాస్ వినియోగాన్ని పెంచాలనే లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. వాయు, ధ్వని కాలుష్యాన్ని తగ్గించేందుకు ఈ గాయస్ వాడకాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. భారీగా పెరుగుతున్న పెట్రోలు, డీజిల్ ధరలు, మరోవైపు పెరుగుతున్న కాలుష్యం.. ఈ నేపథ్యంలో ప్రకృతిని కాపాడేందుకు సిఎన్‌జి గ్యాస్ మంచిదన్నారు. అదేవిధంగా విద్యుత్ వాహనాల వినియోగం కూడా భారీగా పెరగాలన్నారు. ప్రభుత్వాలు ఆ వాహనాలకు సబ్సిడీ ఇస్తున్నాయని, వాటిని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ఆయన సిఎన్‌జి గ్యాస్ వాహనాల ర్యాలీకి జెండా ఊపారు. కాలుష్య నివారణ బోర్డు ఇఇ రాజశేఖర్, ఆ గ్యాస్ కంపెనీల ప్రతినిధులు బన్వాడియా, శేఖర్ వర్మలు, సుష్మలతో పాటు పలు వాహన కంపెనీల ప్రతినిధులు, వాహనదారులు పాల్గొన్నారు.

## నగరంలో త్వరలో

# రెడీమేడ్ దుస్తుల ఫ్యాక్టరీ



నెల్లూరులో త్వరలో రెడీమేడ్ దుస్తుల తయారీ కర్మాగారాన్ని నెలకొల్పనున్నట్లు ఎంఎస్ఎంఇ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మెన్ రవీంద్రనాథ్ చెప్పారు. గతనెల 29న ఆయన నెల్లూరుకు వచ్చారు. జిల్లా పరిశ్రమల కార్యాలయంలో అధికారులతో సమావేశమై మాట్లాడారు. దుస్తుల ఫ్యాక్టరీ ద్వారా వేలాదిమందికి ఉపాధి దొరుకుతుందని, ప్రభుత్వం అందుకు నిధులు సమకూరుస్తుందన్నారు. గ్రామీణ యువత ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంఎస్ఎంఇ కార్పొరేషన్ సిఇఓ గోపాలకృష్ణ, డైరెక్టర్ షేక్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలకు

# స్తంభ ప్రతిష్ట

నెల్లూరు మూలాపేటలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో వచ్చే నెల 11 నుండి జరగనున్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 27న ఆలయంలో అర్చకులు శాస్త్రోక్తంగా స్తంభ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య వైభవంగా ఈ కార్యక్రమం జరిగింది. ఆలయ ఛైర్మెన్ మజ్జిగ చంద్ర మౌళిరెడ్డి, ఆలయ ఇఓ డి.చంద్రశేఖర్‌రావు పాల్గొని పర్యవేక్షించారు.








# నెల్లూరు కబుర్లు



# నెల్లూరులో.. గోవా మద్యం

- 23 లక్షల సరుకు పట్టివేత

గోవా నుంచి మద్యం సీసాలను తీసుకువచ్చి వాటికి ఆంధ్ర లేబుల్స్ అతికించి, ప్రభుత్వ మద్యం దుకాణాల్లో జోరుగా అమ్మేస్తూ అక్రమార్జన చేస్తున్న ముఠా ఎట్టకేలకు దొరికిపోయింది. నెల్లూరు సెబ్ అధికారులు దాడులు చేసి ఆ మద్యం మాయగాళ్ళను పట్టుకుని వారి ఆట కట్టించారు. 8 మందిని అరెస్ట్‌చేసి వారి నుంచి సుమారు 23 లక్షలరూపాయల విలువచేసే గోవా మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ విజయారావు, సెబ్ జేడీ శ్రీలక్ష్మి ఆ వివరాలను గతనెల 29న ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. నెల్లూరు హరనాధపురానికి చెందిన చీమల విజయభాస్కర్‌రెడ్డి తన స్నేహితులతో కలసి గోవా నుంచి తారు ట్యాంకర్‌లో పెద్దసంఖ్యలో మద్యం సీసాలను నెల్లూరుకు తీసుకువచ్చి, వాటిపై ఉన్న గోవా లేబుల్స్ తీసేసి ఏపి మద్యం అంటూ నకిలీ లేబుల్స్‌ను అతికించి అనంతసాగరం, చిలకలమర్రి ప్రాంతాల్లో ప్రభుత్వ మద్యం దుకాణాలకు విక్రయిస్తుండగా అధికారులకు సమాచారం అందింది. వెంటనే సెబ్ అధికారులు నెల్లూరు నగరంలోని మాగుంట లేఅవుట్‌లో వాహనాలను తనిఖీచేసి ఒక కారులో ఉన్న 793 క్వార్టర్ బాటిళ్ళ గోవా మద్యాన్ని పట్టుకున్నారు. విచారణలో వారిచ్చిన సమాచారంతో మరి కొందరు నిందితుల ఇళ్ళపై దాడులు చేసి వారి నుంచి భారీగా 17,808 మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. ఈ గోల్‌మాల్ వ్యవహారంలో మరో ఆరుగురు కూడా ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పరారీలో ఉన్న ఆ ఆరుగురి కోసం గాలిస్తున్నారు. ఆ విక్రయాలకు సహకరిస్తున్న మద్యం దుకాణాల సూపర్‌వైజర్లను ఎక్సైజ్ అధికారులు సస్పెండ్ చేశారు.

# ఇద్దరు సిఐల బదిలీ

నెల్లూరులోని చిన్నబజారు పోలీస్‌స్టేషన్ ఇన్స్‌పెక్టర్ ఎం.మధుబాబును నెల్లూరు సిసిఎస్‌కు బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ డిఐజి త్రివిక్రమవర్మ గతనెల 29న ఉత్తర్వులు జారీచేశారు. ఆయన స్థానంలో గుంటూరు రేంజ్ కార్యాలయంలో ఉన్న పి.వీరేంద్రబాబును నియమించారు. వీరు వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు.

## శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి

# వెండి, రాగి కవచాలు



నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి ఒక అజ్ఞాతభక్తుడు గతనెల 28న వెండి, రాగి కవచాలను సమర్పించుకున్నారు. అమ్మవారి అలంకరణకు ఉపయోగపడే ఆ వస్తువుల విలువ సుమారు 7 లక్షల రూపాయలుంటుందని అంచనా. అమ్మవారి సన్నిధిలో వాటికి పూజలు చేసిన తర్వాత ఆలయ నిర్వాహకులు దాతను అభినందించి సన్మానించారు. ఆలయ ఛైర్మెన్ రత్నం జయరామ్, కార్యనిర్వాహక ఛైర్మెన్ దొరబాబుతో పాటు ధర్మకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పెద్దాసుపత్రి ఎదుట ధర్నా

తమను పర్మనెంట్ చేయాలని కోరుతూ నెల్లూరులోని పెద్దాసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు గతనెల 29న ధర్నా చేశారు. మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు సతీష్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సందానీబాషాల ఆధ్వర్యంలో ఈ ఆందోళన జరిగింది. పెద్దాసుపత్రిలోను, వైద్యకళాశాలలోనూ సెక్యూరిటీ సిబ్బందికి, పారిశుద్య కార్మికులకు గత మూడునెలల నుంచి వేతనాలు చెల్లించలేదని సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.



# టిడిపి ఆవిర్భావ దినోత్సవం

తెలుగుదేశం పార్టీ 40వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గతనెల 29న నెల్లూరులో ఘనంగా జరిగాయి. పార్టీ జెండాను ఎగురవేసి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ సంబరంగా కేకు కట్ చేసి వేడుక జరుపుకున్నారు. తెలుగువారికి మంచి గుర్తింపు తెచ్చిన మహనీయుడు ఎన్టీఆర్ ఆశయసాధన కోసం ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలని టిడిపి నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ అన్నారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ ఆవిర్భావం నుంచి టిడిపిలో కొనసాగుతున్న 80మంది నాయకులు, కార్యకర్తలకు శాలువాలు కప్పి సన్మానించారు. పార్టీ గెలుపు కోసం అందరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. టిడిపి నాయకులు తాళ్లపాక రమేష్‌రెడ్డి, తాళ్ళపాక అనూరాధ, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆనం వెంకటరమణారెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడు, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, రమణయ్యనాయుడు, జెన్ని రమణయ్య, ధర్మవరం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వసాయిలో ఆకట్టుకున్న.. 'ఫ్రూట్స్ డే'



నెల్లూరు మాగుంట లేఅవుట్‌లో ఉన్న విశ్వసాయి డా.ఎస్ఆర్‌కె స్కూల్‌లో గతనెల 26న నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి విద్యార్థులతో కలసి ఉపాధ్యాయులు ఫ్రూట్స్ డేని ఘనంగా నిర్వహించారు. చిన్నారులను ఈ కార్యక్రమం ఎంతో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా చిన్నారులకు పండ్లు, వాటి ఉపయోగాలను తెలియజేశారు. కూరగాయలు, పండ్లు ఆరోగ్యానికి ఎంతో మంచివని వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్, డైరెక్టర్‌తో పాటు విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

# వాత్సల్య చిన్నారులకు అల్పాహారం వితరణ




చిన్నారులకు అల్పాహారం అందజేస్తున్న విఎస్‌యు రిజిస్ట్రార్ డా.ఎల్.విజయకృష్ణారెడ్డి

నెల్లూరులోని వాత్సల్య చిన్నారులకు విఎస్‌యు రిజిస్ట్రార్ డా. ఎల్.విజయకృష్ణారెడ్డి గతనెల 25న తమ సోదరుడు గోపాలకృష్ణారెడ్డి, వదిన ప్రభావతమ్మల జ్ఞాపకార్థం అల్పాహారం అందజేశారు. వారితో ఆత్మీయంగా మాట్లాడారు. తాము నిర్వహిస్తున్న లేబాకు నారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించామని, అదేరోజున వైఎస్సార్ కడపజిల్లా ఒంటిమిట్టలో ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవాలయం నిత్యాన్నదాన క్షేత్రంలో తమ అన్నావదినల స్మారకంగా అన్నప్రసాద వితరణ చేయించామని ఆయన పేర్కొన్నారు.

# నిరుపేదల ఆకలితీర్చిన 'అమ్మా యూత్'

నెల్లూరులోని పలు ప్రాంతాల్లో ఉన్న నిరుపేదలకు స్థానిక 'అమ్మా యూత్ ఫౌండేషన్' వారు ఈనెల 27న ఆహారపొట్లాలను వితరణగా అందించి వారి ఆకలితీర్చారు. ఈ సేవా కార్యక్రమంలో ఆ ఫౌండేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.




# కొత్త పోలీస్‌స్టేషన్ల నిర్మాణానికి చర్యలు

## ● చిరంజీవిరెడ్డి సారధ్యంలో పలు నిర్ణయాలు



ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ అభివృద్ధికి ఆ కార్పొరేషన్ ఛైర్మెన్, నెల్లూరీయులైన మెట్టుకూరు చిరంజీవి రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.సంజయ్‌ల ఆధ్వర్యంలో కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రతిపాదన దశలోనే ఉన్న పలు పోలీస్‌స్టేషన్ల నిర్మాణం చేయాలని కార్పొరేషన్ ఛైర్మెన్, డైరెక్టర్లు కోరగా అందుకు డిజిపి సానుకూలంగా స్పందించారు. నెల్లూరుజిల్లాలోని కలిగిరి సిఐ కార్యాలయం, కలిగిరి, మర్రిపాడు, దగదర్తి పోలీస్‌స్టేషన్లతో పాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాలలో పలు ప్రాంతాలలో పోలీస్‌స్టేషన్ల నిర్మాణం కోసం కూడా డిజిపికి వినతిపత్రాలు అందించారు.

## పార్టీకోసం పునరంకితం....




తెలుగుదేశం పార్టీ స్థాపించి 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 'బెంగళూరు టీడీపీ ఫోరం' ఆధ్వర్యంలో మార్చి 27వతేది, బెంగళూరులోని మార్తహళ్లిలో 'పునరంకిత సభ'ను సమర్ధవంతంగా నిర్వహించిన ఫోరం కన్వీనర్ రావి మోహన్‌చౌదరిని అభినందిస్తున్న మాజీమంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ ఎంఎల్‌ఏ ప్రభాకర్. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బెంగళూరులో నివాసం ఉంటున్న వందలాదిమంది తెలుగుదేశం అభిమానులు, ఆ పార్టీ రాష్ట్ర నాయకులూ పార్టీ కోసం పునరంకితమవుతాం అంటూ శపథం చేశారు.

### ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా..

# అందరూ సమన్వయంతో పనిచేయాలి

## జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసి, జిల్లాను ప్రగతి పథంలో నడిపించాలని జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. ఇటీవల నెల్లూరు జడ్పీ సమావేశ మందిరంలో అరుణమ్మ అధ్యక్షతన జిల్లా ప్రజా పరిషత్ పాలకమండలి సమావేశం జరిగింది. ప్రజాప్రతినిధులు, జెడ్పిటిసి, ఎంపీపీ సభ్యులు సూచించిన పలు సమస్యలపై ఛైర్‌పర్సన్‌తో పాటు జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు చర్చించారు. అనంతరం శాఖలవారీగా సమీక్షించారు. నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు రూరల్ పరిధిలోని వావిలేటిపాడులో జగనన్న లేఅవుట్‌ను త్వరగా చదునుచేసి పనులు ప్రారంభించాలని కోరారు. మనుబోలు మండలం వడ్లపూడి గ్రామంలోని రిజర్వ్ ఫారెస్ట్ నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని, అయినా అటవీశాఖ అధికారులు పట్టించుకోవడంలేదని సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి మిల్లర్లు రైతులను ఇబ్బందులు పెడుతున్నారని, రైతు భరోసా కేంద్రాల నుంచి మిల్లులకు పంపించిన ధాన్యాన్ని దించుకోవడం లేదని, ఒక బస్తాకు 9కిలోలు అదనంగా ధాన్యం ఇస్తేనే లారీలోని బస్తాలను దించుకుంటున్నారని, అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి కోరారు. జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు అందుకు స్పందిస్తూ ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, త్వరలోనే రైతులకు చెల్లించాల్సిన పాత బకాయిలు రూ.128 కోట్లను ప్రభుత్వం విడుదల చేయనుందని వివరించారు. నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీలు వాకాటి నారాయణరెడ్డి, విఠపు బాలసుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, జడ్పీ సిఇఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత, ఇటీవల మృతి చెందిన మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి, పొదలకూరు ఎంపీపీ నిమ్మల విజయమ్మల ఆత్మశాంతికి కొద్దిసేపు మౌనం పాటించి నివాళులర్పించారు.

### ● ప్రభుత్వ తాజా నిర్ణయం

# ప్రైవేట్ స్కూళ్లలో.. పేదవిద్యార్థులకు 25 శాతం సీట్లు

రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు విద్యాసంస్థల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలని, అందుకు సంబంధించి విద్యాహక్కు చట్టాన్ని అమలుచేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పేద విద్యార్థుల్లో సంతోషం కలిగిస్తోంది. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం 12(1)సి నిబంధనను అమలుచేయాలని విద్యాశాఖ సంకల్పించినట్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కె.సురేష్‌కుమార్ తెలిపారు. విద్యాహక్కు చట్టం రాష్ట్ర కమిటీ ఛైర్మెన్ బుడితి రాజశేఖర్, సభ్యులు, ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ల ప్రతినిధులు, ఎన్జీఓలతో సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నారు. దీని అమలుకు ఆ పాఠశాలల అసోసియేషన్ల ప్రతినిధులు, ఎన్జీఓలు అంగీకరించారని కమిషనర్ పేర్కొన్నారు. 2022-23 విద్యా సంవత్సరం నుంచి ఈ చట్టాన్ని అమలుచేసేందుకు ప్రభుత్వం నిర్ణయించినందువల్ల ఆ దిశగా తీసుకోవాల్సిన చర్యలను వారు సమీక్షించారు. ఒక్కో విద్యార్థికయ్యే ఖర్చుకు సంబంధించిన విషయాలపై కూడా కమిటీ చర్చించిందని తెలిపారు. ఈ సమావేశంలో సమగ్రశిక్షా రాష్ట్ర సంచాలకులు కె. వెట్రిసెల్వి పాల్గొన్నారు.




పుణ్య సంస్మరణ

మాన్యుడు, మరపురాని నేత

శ్రీ సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి గారు

కీర్తిశేషులై ఏప్రిల్ 6వ తేదీకి 39 సంవత్సరాలు గడవనున్న సందర్భంగా

ఆ పుణ్యమూర్తిని స్మరిస్తూ...

వారి పవిత్రాత్మకు భక్త్యంజలి ఘటిస్తున్నాము.

కుమారులు: సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి
మాజీ మంత్రివర్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు

లేట్ సోమిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

కుమార్తెలు - అల్లుళ్ళు
కట్టంరెడ్డి రాణీసంయుక్త - రాధాకృష్ణారెడ్డి
కేతిరెడ్డి ఉషారాణి - రామకోటారెడ్డి

| మనుమలు - | మనుమరాండ్రు | మునిమనుమలు | మునిమనుమరాండ్రు |
|---|---|---|---|
| సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి - | శ్రుతి | యల్లా శర్వీన్ | యల్లా సంజన |
| డా॥ సోమిరెడ్డి అర్జున్‌రెడ్డి- | డా॥ లక్ష్మీ ఐషిత | కేతిరెడ్డి శ్రీమన్ | సోమిరెడ్డి శివాని |
| సన్నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి - | నీలిమ | నిమ్మ ధీర్ | కేతిరెడ్డి శ్రితిక |
| నిమ్మ కౌశిక్‌రెడ్డి - | డా॥ సింధు | కేతిరెడ్డి శ్రీవంత్ | కట్టంరెడ్డి శ్రీశాన్వి |
| యల్లా సనత్‌రెడ్డి - | షాలిని | సన్నారెడ్డి రాయల్ భార్గవ్ | కట్టంరెడ్డి హవిష |
| డా॥ కేతిరెడ్డి కళాధర్‌రెడ్డి | | నిమ్మ నరేన్ | సన్నారెడ్డి నిరుక్తలేఖ |
| కేతిరెడ్డి శశిధర్‌రెడ్డి - | కీర్తి | సోమిరెడ్డి రణదేవ్ | సోమిరెడ్డి అమైరా |
| కట్టంరెడ్డి విక్రమ్‌రెడ్డి - | స్నిగ్ధ | సోమిరెడ్డి ఆగస్త్య | |

# వివిఎస్ఆర్‌లో ఫుడ్ ఫెస్టివల్



గూడూరు రెండవ పట్టణ పరిధిలోని వివిఎస్ఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఇటీవల ఫుడ్‌ఫెస్టివల్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ బాలకృష్ణంరాజు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తమ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నామని, భారతీయ సంస్కృతి సాంప్రదాయాలలో భాగమైన పలు రకాల వంటలను నేటి తరం విద్యార్థులు మర్చిపోతున్నారన్నారు. ఫాస్ట్‌ఫుడ్స్ పేరుతో విద్యార్థులు తమ యొక్క ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారని, అనేక రకాల రుచికరమైన వంటలకు మన దేశం పుట్టినిల్లని గుర్తు చేశారు. తొలుత పాఠశాల విద్యార్థులు పలు రకాల వంటకాలను తమ ఇంట్లో తయారుచేసి ప్రదర్శించి, వాటి ప్రాముఖ్యతను తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతకుమార్, రోటరీ ప్రతినిధులు సురేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చిరంజీవి యువత రక్తదానం



గూడూరు పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో సినీ నటుడు రామ్‌చరణ్ జన్మదినాన్ని చిరంజీవి యువత నిర్వహించింది. రామ్‌చరణ్ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని ఈ సందర్భంగా చిరంజీవి యువత గూడూరు నియోజకవర్గ అధ్యక్షులు సయ్యద్ నయూమ్ అన్నారు. అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో సుమారు 60మంది మెగా అభిమానులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో చైతన్య, చెన్నూరు వెంకి, చందు, సాయి, చరణ్, కిరణ్, జ్యోతిష్, బాలాజీ, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులకు భోజనం పంపిణీ



వృద్ధులకు సేవలు చేయడం సంతోషంగా ఉందని శ్రీకృష్ణ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బి.శ్యామ్‌సుందరరావు తెలిపారు. గూడూరు లోని నిరాశ్రయుల కేంద్రంలో శ్రీకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు, నిరాశ్రయులకు భోజనం పంపిణీ చేశారు.

## ఎల్ఐసిని షేర్ మార్కెట్‌లో పెట్టకండి



సమ్మెలో పాల్గొన్న ఎల్ఐసి ఉద్యోగులు

రెండురోజుల దేశవ్యాప్త సమ్మెలో భాగంగా గూడూరు ఎల్ఐసి ఆఫీస్ ఆవరణలో ఎల్ఐసి ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఎల్ఐసిని షేర్ మార్కెట్‌లో పెట్టకూడదని నినాదాలు చేశారు. అధ్యక్షులు డివి శ్రీనివాసరావు, కార్యదర్శి శివకుమార్, బ్రాంచి ఇన్‌ఛార్జ్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ జనార్దన్, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు జగదీష్, రమేష్, సిబ్బంది, ఏజెంట్లు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

# మహిళా మండలి చలివేంద్రం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ శ్రీకాంత్

గూడూరు పట్టణ పరిసర ప్రాంతాల్లో ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్ వీల్ క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ అన్నారు. పట్టణంలోని జడ్పీ హైస్కూల్ రోడ్డులో వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజల దాహార్తిని తీర్చేందుకు అరుణ సహకారంతో ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ సంస్థల ప్రతినిధులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఆంధ్ర మహిళా మండలి కార్యదర్శి విష్ణువందన ఇందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీకాంత్ మాట్లాడుతూ వేసవి కాలంలో భానుడి ప్రతాపం నుంచి తప్పించుకునేందుకు జాగ్రత్తలు పాటించాలని, కూల్‌డ్రింక్స్ కంటే మంచినీటి వినియోగం ఉత్తమమని సూచించారు. అనంతరం అంగన్‌వాడి కేంద్రానికి పలకలు, బలపాలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చెరుకూరు రోహిణి, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు నాగసూరి లక్ష్మి, కార్యదర్శి కొనెదల అనిత, సభ్యులు మల్లాభత్తిన జీవనిరెడ్డి, ఎల్లసిరి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బర్త్‌డే కేకును కట్ చేస్తున్న నిర్విక, క్లబ్ సభ్యులు

కాగా, గూడూరు సమీపంలోని దివిపాళెం మార్గంలో ఉన్న డానియల్ చిల్డ్రన్స్ హోమ్‌లోని విద్యార్థులకు ఈ నెల 29న భోజన వసతి ఏర్పాటు చేశారు. క్లబ్ సభ్యురాలు సుప్రభ మనమరాలు నిర్విక జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి ఆధ్వర్యంలో నిర్వహించారు.

# నూలు దారాలతో... చిత్ర కళాఖండాలు




○ డా. శివశంకరయ్య అద్భుత సృష్టి

○ ఏప్రిల్ 12న 'బంగారు నంది' బహుకరణ



*నూలు దారాలతో అత్యద్భుతమైన చిత్రకళా ఖండాలు సృష్టిస్తూ.. అద్వితీయమైన కళాప్రతిభతో రాణిస్తూ.. ఎన్నెన్నో అవార్డులు అందుకుంటూ అందరి అభినందనలు అందుకుంటున్నారాయన. పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా ఉంటూనే తనకెంతో ఇష్టమైన సారస్వతరంగంలో అపూర్వమైన తాళపత్ర గ్రంథాలపై పరిశోధనలు చేస్తూ, మరోవైపు చిత్రకళా రంగంలోనూ తనదైన నైపుణ్యంతో అరుదైన కళను సొంతం చేసుకుని ఎందరో ప్రముఖుల ప్రశంసలందుకుని నెల్లూరుసీమ కళారంగానికే గర్వకారణంగా నిలుస్తున్నారు. ఆయన పేరు...డా. శివశంకరయ్య. సాహిత్య పరిశోధకునిగా, అద్భుత చిత్రకళాకారునిగా ఆయన చేస్తున్న సేవలకు గుర్తింపుగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా హైదరాబాద్‌లో ఏప్రిల్ 12న 'బంగారు నంది' అవార్డును కూడా అందుకోబోతున్నారు.*

చిత్రాలు వేసేందుకు ఆయనకు కాన్వాస్..బ్రష్‌లు..రంగులు అవసరం లేదు. కేవలం నూలు దారాలు..వాటిని అతికించడానికి ఫెవికాల్ లేదా క్విక్‌ఫిక్స్ వంటివి ఉంటే చాలు. ఆయన కళా నైపుణ్యంతో అవి ఎంతో కనువిందుచేసే చిత్ర కళాఖండాలుగా రూపుదిద్దుకుంటాయి. ప్లాస్టిక్‌పేపర్‌పై బొమ్మను వేసుకుని దానిమీద దారం పేర్చుతూ రూపొందించే ఈ చిత్రాలు చూడముచ్చటగా ఉండి.. అందరినీ ఎంతో ఆశ్చర్యచకితుల్ని చేస్తున్నాయి. తనకెంతో ఇష్టమైన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి చిత్రంతో ప్రారంభమైన ఈ కళాసృష్టి ఇప్పటికి దాదాపు వెయ్యికి పైగానే చిత్రాలతో మరింత ముందుకు సాగుతూనే ఉంది. ఏమాత్రం సమయం దొరికినా ఆయన ఈ చిత్రాలను ఎంతో ఓర్పుతో నేర్పుతో వేస్తూనే ఉంటారు. ప్రతి చిత్రం ఒక కళాఖండమే. ఎందరో దేవతామూర్తులు, దేశభక్తుల చిత్రాలు ఆ సన్నని దారాల్లో ఒదిగిపోవడం.. చూసి తీరాల్సిందే అన్నట్లుంటాయి.









## కంపసముద్రం నుంచి సాహితీ సంద్రంలోకి :

నెల్లూరుజిల్లాలోని మర్రిపాడు మండలం కంపసముద్రం గ్రామం ఆయన స్వస్థలం. పూర్తిపేరు మున్నెల్లి శివశంకరయ్య, తల్లితండ్రులు ఎల్లమ్మ-చెన్నయ్య. ప్రాథమిక విద్యను పుట్టినూరులోనే చదువుకుని, కావలి జవహర్‌భారతిలో ఇంటర్, డిగ్రీ పూర్తిచేసి, తిరుపతి ఎస్వీ యూనివర్శిటీలో ఎమ్మెస్సీ, ఎంఇడి, ఎంఏ మాస్టర్ డిగ్రీలు కూడా అభ్యసించి, హిందీలో బిఏ చదివి, కంప్యూటర్ సైన్స్‌లో కూడా పీజీ డిప్లొమా సాధించి ఉన్నత విద్యల్లోనూ ఉత్తమంగా రాణించారాయన. 2001 డిఎస్సీలో టాపర్‌గా నిలిచి సెకండరీగ్రేడ్ టీచర్‌గా తొలుత జిల్లాలోని కృష్ణాపురం స్కూల్‌లో ఉపాధ్యాయునిగా చేరారు. ప్రస్తుతం మర్రిపాడు మండలంలోని బూదవాడ ప్రాథమికోన్నత పాఠశాలలో హెడ్మాస్టర్‌గా పనిచేస్తున్నారు. ఉపాధ్యాయునిగా ఉంటూనే తనకెంతో ఇష్టమైన సాహితీరంగంలోకి వచ్చి తాళపత్ర గ్రంథాలన్నిటినీ శోధించి అరుదైన పరిశోధకునిగా అభినందనలందుకుంటున్నారు.

## 75 గంటల్లో 75 చిత్రాలు

గత ఆగస్టు 15న స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకుని రాజమండ్రి దగ్గరున్న రావులకొల్లులో జరిగిన కార్యక్రమంలో 75 గంటల్లో 75 మంది జాతీయ నాయకుల దారాల చిత్రాలు వేసి ఆయనందరి కరతాళధ్వనులందుకున్నారు. జాతీయస్థాయిలో ఆయనకిది ఓ మంచి గుర్తింపును తీసుకువచ్చింది. తన సాహితీ పరిశోధనలు, చిత్రకళాప్రతిభను మెచ్చుకుంటూ హైదరాబాద్‌లో మహేంద్రవాడ సంస్థ వారు అవార్డునిచ్చి స్వర్ణకంకణం బహుకరించారు. ఇలా ఎన్నోచోట్ల ఆయనెన్నో అవార్డులను, ప్రముఖుల నుంచి ఘన సన్మానాలను అందుకున్నారు. దాదాపు 40కి పైగానే జాతీయస్థాయి అవార్డులను సాధించారు.

## మొల్లమ్మపై పరిశోధనలు :

నెల్లూరుజిల్లా గోపవరం గ్రామానికి చెందిన ప్రఖ్యాత కవయిత్రి, రామాయణం రచయిత్రి మొల్లమాంబ సారస్వతంపై, ఆమె నివసించిన గోపవరం గ్రామం, పూజలు చేసిన శ్రీకంఠ మల్లేశ్వరాలయం వంటి వాటిపై డా. శివశంకరయ్య చేసిన అద్భుత పరిశోధనలు రాసిన గ్రంథాలు ఆయనకు సాహితీ పరిశోధనల రంగంలో ఎనలేని పేరును తెచ్చాయి. మొల్లమ్మ నెల్లూరుజిల్లా గోపవరం గ్రామ నివాసేనంటూ మొల్లమ్మ రాసిన తాళపత్రగ్రంథాలతో సహా అనేక సాక్ష్యాధారాలు సేకరించి నిరూపిస్తూ పలు గ్రంథాలు రాశారు. 'మొల్ల రామాయణం- మొల్ల స్థానికత' ఉదయగిరి రాజ్య చరిత్ర, బద్వేలు రాజ్యచరిత్ర, బ్రహ్మంగారు జీవసమాధి అయ్యే ఘట్టాలతో ఆయన రాసిన 'బ్రహ్మజ్ఞానోపాయం' గ్రంథం వంటివన్నీ ఆయన పరిశోధనాత్మకతకు..సాహితీప్రతిభకు నిదర్శనాలు. సింహపురిసీమకే గర్వకారణమైన రీతిలో ఎన్నో పరిశోధనలు చేస్తూ, మరోవైపు తనదైన శైలితో ఎన్నో అపురూప చిత్రకళా ఖండాలను కూడా సృష్టిస్తున్న డా. శివశంకరయ్య ఎంతైనా అభినందనీయులు.

## కామాక్షమ్మ ఆలయానికి.. 43.28 లక్షల రాబడి

జొన్నవాడలోని మల్లికార్జున సమేత శ్రీ కామాక్షితాయి అమ్మవారి దేవాలయంలో గతనెల 29న హుండీ కానుకలను లెక్కించారు. గత డిసెంబరు 20 నుంచి మార్చి 29వతేదీ దాకా ఉన్న కానుకలను లెక్కించగా 43,28,105 రూపాయల నగదు, 210 గ్రాముల 200 మిల్లీగ్రాముల బంగారు, 607 గ్రాముల 100 మిల్లీగ్రాముల వెండిని భక్తులు సమర్పించినట్లు ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. హుండీల లెక్కింపును ఆలయ ఛైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యనాయుడు, ఇఓ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఇన్‌స్పెక్టర్ చైతన్య తదితరులు పర్యవేక్షించారు.

## శుభకృతూ.. ఇప్పుడే రాకు!

ఇక్కడ –
ఓ శిఖరం విధ్వంసమై.. నేలకొరిగిన పతనావస్థ
భూకంపం బారిన పడిన భూమి
కుప్పకూలిన వ్యవస్థల తాలూకు శిథిల దృశ్యం
రేపు ఉదయించాల్సిన మార్తాండుడు
ఉదయించే స్థితి నుంచి నిష్క్రమించిన సంకేతం
రాత్రికి వెలుగు పంచాల్సిన నెలరేడు
కర్తవ్య నిర్వహణా యజ్ఞంలో విఫలమైన సంక్షోభం
ఇక ఉగాది పొడసూపేదెక్కడ
కలకూజిత రాగం శ్రావ్యమయ్యేదెప్పుడు
చిగుళ్ళు తిని రాగాలు పలకాల్సిన కోయిల
ఓటినావ పగుళ్ళ ఆనవాళ్ళకు వెరచి కుప్పకూలిపోయింది.
ఇదో విచిత్రమైన వ్యవస్థ
కాలనాగులు సంచరించే భయానక ఉద్విగ్నత
కొండలు కూలుతుంటే..
కోనలు ఇంధనాల్లా భగ భగ మండే దీనావస్థ
అరాచకపు అలల తాకిడికి బ్రతుకు
దుర్భరమై కుదేలైన మనిషి నిలువెత్తు మంటల్లో
కాలిపోతున్న దుర్ఘటన
అబద్ధం అందలం ఎక్కి నాట్యం చేస్తుంటే –
నిప్పులాంటి నిజం దహించి బూడిదైన సందర్భం.
ఓ నా శుభకృతూ మాకెక్కడిదమ్మా పురోగతి
దారి తప్పి వచ్చినట్టున్నావ్ వెళ్ళమ్మావెళ్ళు
మంచి ముహూర్తం చూసి ఆహ్వానిస్తా.
అప్పుడు ఆసాంతం విచ్చేద్దువు గాని!



– చిన్ని నారాయణరావు
9440202942

# 'సమ్మె'ట పట్టిన కార్మికలోకం

## ం నెల్లూరులో బంద్ ప్రశాంతం



నెల్లూరు గాంధీబొమ్మ కూడలి వద్ద నిరసనలు తెలుపుతున్న కార్మికసంఘాల కార్యకర్తలు, నాయకులు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మికలోకం గళ మెత్తి గర్జించింది. నినాదాలు, ఆందోళన లతో అనేక ప్రాంతాలు హోరెత్తిపోయాయి. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రెండు రోజుల బంద్‌లో భాగంగా గత నెల 28–29 తేదీల్లో జరిగిన దేశవ్యాప్త సమ్మె నెల్లూరు జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. అయితే అనేకచోట్ల బంద్ ప్రభావం పాక్షికంగానే కనిపించింది. సోమవారం జరిగిన బంద్‌లో అనేక మంది కార్మికనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండు వద్ద నుంచి గాంధీ విగ్రహం వద్దకు ర్యాలీగా నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున కదిలి వచ్చారు. ఎర్రజెండాలు చేతపట్టి నగరవీధుల్లో ప్రదర్శనలు, ఆందోళనలు నిర్వహించారు. బుధవారం విఆర్‌సి సెంటర్ నుంచి బిఎస్ఎన్ఎల్ సెంటర్‌దాకా మానవహారం నిర్మించి నిరసన తెలియజేశారు. కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను తుంగలోకి తొక్కిందని, ప్రభుత్వ సంస్థలను కారుచౌకగా ప్రైవేట్ వ్యక్తులకు, కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతుండడం దారుణమంటూ నాయకులు ధ్వజమెత్తారు. నిరుద్యోగ సమస్య ప్రబలిపోయిందని, పెట్రోలు డీజలు ధరలు పెరిగిపోయాయని ఆందోళన చేశారు. కరోనా కారణంగా కోట్లాదిమంది పేదల కుటుంబాలు రోడ్డునపడ్డాయని, వారిని ఆదుకునేందుకు మోదీ ప్రభుత్వం చేసిందేమీ లేదని విమర్శించారు. కోవిడ్ మూలంగా ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయాయని, ఎంతోమంది కరోనా కాటుకు బలైపోయారని, అలాంటి అసహాయుల కుటుంబాలకు కూడా సాయం చేసేందుకు కేంద్రప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను, ప్రైవేటీకరణలను వ్యతిరేకించాలని, విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేసే యత్నాలపై ప్రజలు ఉద్యమించాలన్నారు. కార్మికులకు కనీస వేతనాలివ్వాలని కోరారు. పెట్రోలు డీజలు ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఏపి జెన్‌కోను ప్రైవేటీకరణ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలన్నారు. జిల్లాలోని ధాన్యం రైతులకు కనీస మద్దతుధరఇవ్వాలని వారు కోరారు. ఏఐటియుసి రాష్ట్ర వర్కింగ్ జనరల్ సెక్రటరీ వెంకటసుబ్బయ్య, సిఐటియు జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు, సిపిఐ, సిఐటియ, సిపిఎంఎల నాయకులు ఏ.శ్రీనివాసులు, నాగేశ్వరరావు, కత్తి శ్రీనివాసులు, బ్యాంక్ ఉద్యోగుల సంఘం నాయకుడు సుమన్‌తోపాటు పలు ట్రేడ్‌యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

## నృసింహస్వామి సేవలో.. కమలానందభారతి స్వామీజీ



గన్నవరం పీఠాధిపతి శ్రీ కమలానంద భారతి స్వామీజీ గతనెల 27న జిల్లాలోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన పెంచలకోనలో వెలసివున్న శ్రీ లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామీజీని పూర్ణకుంభంతో స్వాగతించి మూడు ఆలయాల్లో పూజలు జరిపించారు. ఆలయ అర్చకులు శశిస్వామి, త్రినాథ్‌స్వామి, నాగరాజస్వామి, వినోద్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

## మహా కవయిత్రి మొల్లమ్మ పూజలు చేసిన.. 'గోపవరం' శ్రీకంఠ మల్లేశ్వరాలయం

*'గావ్య సంపద క్రియలు నిఘంటువులును గ్రమమ లేవియు నెరుగ, విఖ్యాత గోప వరపు శ్రీకంఠమల్లేశు వరము చేత నెరి కవిత్వంబు జెప్పగా నేర్చుదాన'..*

అంటూ ఎంతో వినయసంపత్తితో మొల్లమ్మ తన పద్యాల్లో స్వయంగా ప్రకటించుకుంది. అత్యంత భక్తిప్రపత్తులతో గోపవరంలోని శ్రీకంఠ మల్లేశ్వరుని దేవాలయంలో పూజలు చేసి 'రామాయణం'ను అత్యద్భుతంగా..సరళ సుందరంగా, పండిత పామర జనరంజకంగా రచించిన నెల్లూరుసీమకు చెందిన మహాకవయిత్రి మొల్లమ్మ, మహాచక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి మొల్లమ్మ.. క్రీ.శ 1440 ప్రాంతానికి చెందిన కవితాశిరోమణిగా నేటికీ సారస్వత చరిత్రలో ఆణిముత్యంగా ప్రకాశిస్తూనే ఉంది. నెల్లూరుజిల్లాలోని కలువాయి మండలంలోని గోపవరం గ్రామం మొల్లమ్మ తండ్రి కేసనసెట్టి స్వస్థలం. ఈ గోపవరం గ్రామంలోనే ఉన్న శ్రీకంఠ మల్లేశ్వరుని దేవాలయంలో పూజలు చేసి మొల్లమ్మ రామాయణం రచించినట్లు, ఆ తర్వాత ఆమె కొంతకాలం తాతగారి ఊరైన కోవూరు వద్ద వున్న పడుగుపాడు గ్రామంలోనూ నివసించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. మొల్లమ్మ పడుగుపాడు గ్రామ నివాసి అని బ్రిటిష్‌వారి నెల్లూరు గెజిట్‌లోనూ స్పష్టంగా ఉంది. కనుక మొల్లమ్మ స్వస్థలం నెల్లూరుజిల్లా అనేది సుస్పష్టం..నిర్వివాదాంశం. కుమ్మరి కులంలో జన్మించినా అనితరసాధ్యమైన రీతిలో ఆమె రామాయణం రచించడం, అసలు స్త్రీలకు విద్య అనేదే లేని నాటి కాలంలో, భగవద్దత్తంగా అబ్బిన విద్వత్తుతో ఆమె కవితా రచన చేసి నారీలోకానికే కాదు సారస్వత జగత్తుకే మార్గదర్శకంగా నిలవడం అపూర్వం. నెల్లూరుసీమలోని ఈ 'గోపవరం' గ్రామంలోనే నాటి కాలం నుంచి అత్యంత పురాతనమైన శ్రీకంఠ మల్లేశ్వరుని దేవాలయం ఉంది. మొల్లమ్మ జీవితానికి..కవిత్వానికి నేటికీ ప్రత్యక్షసాక్షిగా కూడా ఆ ఆలయం నిలిచే ఉంది.





మన దేవాలయాలు (93)

### 600 ఏళ్ళ క్రితం నాటి దేవాలయం :

మొల్లమ్మ పూజలు చేయడానికి ముందు నుంచే అంటే ఇప్పటికి సుమారు 600 సంవత్సరాల క్రితం నుంచే జిల్లాలోని కలువాయి మండలంలోని వెదనపర్తి గ్రామ సమీపంలో ఉన్న ఈ గోపవరం గ్రామంలో ఎంతో మహిమాన్వితమైన శ్రీకంఠ మల్లేశ్వరుని దేవాలయం ఉంది. ఈ ఆలయంలో గంగా పార్వతీ సమేతంగా లింగరూపధారియైన పరమశివుడు వెలసివున్నాడు. స్వయంభువుగా వెలసిన శ్రీకంఠ మల్లేశ్వరస్వామి దేవాలయం ఎంతో అపురూపమైనదంటూ పూర్వంలో జగద్గురు ఆదిశంకరాచార్యుల వారు కూడా ఈ ఆలయాన్ని దర్శించుకుని పూజలు చేసినట్లు ప్రతీతి. అక్కడున్న శివలింగం మీద కంఠభాగం ఉండడం, అదీ నీలిరంగులో ఉండడం ఒక అద్భుతం. ఆ శివలింగాన్ని కొంత ముందుకు జరిపి నెలకొల్పాలని గతంలో కొంతమంది ప్రయత్నించి 30 అడుగుల దాకా తవ్వినా శివలింగం కిందిభాగం ఎక్కడున్నదో అంతుపట్టక ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. అక్కడున్న నంది విగ్రహం కూడా అపూర్వమైనదే. అలాంటి నందీశ్వరుని విగ్రహమూర్తి కాశీ క్షేత్రంలోని నంది విగ్రహాన్ని పోలినట్లు ఉంటుంది. అంతేకాదు మరో విచిత్రమైన విషయం మేమిటంటే.. ప్రతి రెండేళ్లకోసారి ఎక్కడినుంచో ఒక నాగసర్పం వచ్చి స్వామి వారి శివలింగంపై పడగ విప్పి అలాగే నిలచి ఉంటుంది. శ్రీకంఠ మల్లేశుని మహిమలకు ఇదొక నిదర్శనం. అందుకే ఈ ఆలయాన్ని శ్రీ నాగేశ్వరస్వామి దేవస్థానంగా కూడా గ్రామస్తులు వ్యవహరిస్తుంటారు. ఇటీవలికాలంలో ఆలయ ప్రాంగణంలో మొల్లమ్మ విగ్రహం కూడా ప్రతిష్ఠించారు. నెల్లూరుజిల్లాకు చెందిన ప్రసిద్ధ పరిశోధకులు డా.శివశంకర్ అటు మొల్ల గురించి, ఇటు శ్రీకంఠ మల్లేశుని ఆలయం ప్రాశస్త్యం గురించి పరిశోధనలెన్నో చేసి తన గ్రంథంలో ఇంకా ఎన్నో ఆసక్తికరమైన విశేషాలు తెలియజేసి ఉన్నారు.



కవయిత్రి మొల్లమ్మ

### కోరిన కోర్కెలు నెరవేర్చే దైవం :

శ్రీకంఠ మల్లేశుని భక్తితో దర్శించుకుంటే దీర్ఘవ్యాధులు, ఎంతటి మొండి చర్మవ్యాధులైనా నయమవుతాయని భక్తుల విశ్వాసం. స్వామివారికి ఏటా మహాశివరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహిస్తుంటారు. ఆదిశంకరాచార్యుల వారు ఆలయానికి వచ్చిన రోజును పురస్కరించుకుని ప్రతి ఏడాది శంకర జయంతి నిర్వహిస్తుంటారు. ఆరు వందల సంవత్సరాలకు పైగా గడిచిపోతున్నా ఆలయ కమిటీవారు, గ్రామస్తులు, భక్తులందరి సహకారంతో నెల్లూరుసీమకే గర్వకారణమైన ఈ పురాతనాలయం నేటికీ నాటి చరిత్రకు సాక్షంగా నిలిచేవుంది.

# మరో ఘనత సాధించిన అపోలో హాస్పిటల్

## ఒకే రోగికి మిత్రాక్లిప్ మరియు టిఏవిఆర్ ప్రక్రియ

అరుదైన శస్త్రచికిత్సలతో రికార్డులు సాధిస్తున్న అపోలో హాస్పిటల్స్ మరో ఘనత సాధించింది. మిత్రాక్లిప్ మరియు ట్రాన్స్ కాథోటర్ అయోర్టిక్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ రెండింటిని ఒకేసారి విజయవంతంగా ఇప్లాంట్ చేసింది. శ్రీలంకకు చెందిన 75ఏళ్ల వృద్ధుడు ధమని సంబంధిత స్టెనో సిస్ మరియు మిట్రల్ వాల్వ్ రెగర్జి టేషన్‌తో తీవ్రమైన గుండె నొప్పితో హాస్పిటల్‌లో చేరాడు. దీంతో చెన్నైలోని అపోలో హాస్పిటల్స్‌లో సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సాయి సతీష్ ధమని కవాటాన్ని రిపేరు చేయడానికి టిఏవి ఆర్‌ను, మిట్రల్‌వాల్వ్ మరమ్మత్తుకు మిత్రక్లిప్‌ను ఒకేసారి ఆ వృద్ధుడిలో విజయవంతంగా అమర్చి ఘనత సాధించారు.

# సామాన్యుడి కరెంటుబిల్లు పెరిగింది

(మొదటి పేజీ తరువాయి)

కరెంట్ లేనిదే లైటు వెలగదు.. ఫ్యాను తిరగదు. ఇళ్ళల్లో లైట్లు లేకుండా ఫ్యాన్లు తిరగకుండా బతకలేం. ఇప్పుడు విద్యుత్ అన్నది ఎవరికైనా నిత్యావసరమే. ప్రజలకు అలాంటి అత్యవసరాలపై ఇబ్బందులు లేకుండా, సరఫరాలో ఎలాంటి అవాంత రాలు లేకుండా చూడడమే కాదు, మోయ లేని చార్జీల భారాలు పడకుండా చూడా ల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. కానీ ఇప్పుడు అలాంటి బాధ్యతలకు ప్రభుత్వాలు తిలోద కాలు ఇస్తున్నాయా అనిపిస్తోంది..తాజా విద్యుత్ చార్జీలు చూస్తే. విద్యుత్ సంస్థలను ఆదాయం తేవడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రజలపై ఒక్కసారిగా దాదాపు 1400 కోట్ల రూపాయల దాకా భారం మోపుతూ నిర్ణయం తీసుకోవడం పట్ల సర్వత్రా ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. కరెంటు బిల్లులు తగ్గించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తామని పాదయాత్రలో హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి, తీరా అధికారంలోకి వచ్చాక ఎడాపెడా బిల్లులు పెంచేయ డంతో ప్రజలు బిక్కముఖం పెట్టుకుంటు న్నారు. యూనిట్ ధర కనిష్ఠంగా 45 పైసలు, గరిష్ఠంగా రూపాయి 57 పైసలకు పెంచారు. గతంలో ఉన్న మూడు టారిఫ్ లను ఆరుగా చేశారు. ముఖ్యంగా నిరు పేదలు, మధ్యతరగతి ప్రజలపై భారం మోపారు. కనీస వినియోగ పరిమితిని 50 యూనిట్ల నుంచి 30 యూనిట్లకు కుదించడంతో పాటు యూనిట్ ధర రూ. 1.90 చేశారు. గతంలో మరీ ఇంత ఘోరంగా ఛార్జీలు పెంచేవారు కాదు. ముందు వెనుక ఆలోచించేవారు. ప్రజలకిది నిత్యావసరం కనుక ఆచితూచి వ్యవహరించేవారు. ఛార్జీలు పెంచే విషయంలో డిస్కమ్ కంపెనీలు ప్రజాభిప్రాయాన్ని దృష్టిలో పెట్టుకుని అటు సంస్థలు నష్టపోకుండా, ఇటు ప్రజలు కష్టపడకుండా ఎంతో జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకునేవారు. ఇప్పుడు అలాంటి వేమీ ఉండడం లేదు. ప్రజలు ఎంత నష్ట పోయినా, కష్టపడుతున్నా పట్టించుకునే వారే ఉండడం లేదనే ఆవేదన ప్రజల్లో కనిపిస్తోంది. అసలే కరోనా కాటుతో ఆర్థికంగా అన్నిరకాలుగా చితికిపోయిన ప్రజలు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న పరిస్థితుల్లో హఠాత్తుగా నెత్తిమీద ఏ పిడుగో పడినట్లుగా బాధపడుతున్నారు. అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగిపోయి బతుకే భారంగా ఉన్న నేటి రోజుల్లో ఇలాంటి ధరాఘాతాలను ఎలా తట్టుకోవాలో అర్థం కాక సతమతమవుతున్నారు. ఏప్రిల్ 1వ తేది నుంచే ఈ కొత్త బాదుడు ఛార్జీలు అమలులోకి వస్తున్నాయి కనుక, ఎంత కట్టాల్సివస్తుందో ఏమో భగవంతుడా అని సామాన్యులు దిగాలుపడి పోతున్నారు.

# శ్రీకీర్తికి కిరీటం..

(మొదటి పేజీ తరువాయి)


• మంత్రివర్గం

## మార్పు తర్వాతే మార్పు?

> మరికొంత సమయం ఇవ్వనున్న ప్రస్తుత మంత్రులు
> సంక్రాంతి నుండి ఉగాదికి మారిందంటున్న ముహూర్తం
> మార్పు తరువాతే మార్పులుంటాయంటున్న పార్టీ వర్గాలు
> పరిశీలనలో పాత జిల్లాలు.. పాతిక మంది అమాత్యులు

విస్తరణపై వీడని ఉత్కంఠ

'లాయర్' 2021 డిసెంబర్ 24వ తేదీ సంచికలోని మొదటిపేజీ వార్త

వైసీపీ నాయకులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన మంత్రివర్గ మార్పుకి ఎట్టకేలకు ముహూర్తం ఖరారయ్యింది. 'మార్పి తరువాతే మార్పు' అంటూ 2021 డిసెంబర్ 24వతేదీన క్రిస్మస్ సమయంలో 'లాయర్' చెప్పిన జోస్యం 2022 ఉగాది నాటికి నిజమయ్యింది. ఏప్రిల్ 11వతేదీ కొత్త మంత్రివర్గం కొలువు తీరనుంది. ఆరోజు ఉదయం కొత్త మంత్రివర్గం ప్రమాణస్వీకారం ఉంటుందని ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాల సమాచారం. పాతవాళ్లలో ఉండేదెవరు...? ఊడేదెవరు...?? అన్నది ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమయ్యింది. జిల్లాకి ఒక మంత్రి అన్న విధానాన్ని ప్రామాణికంగా తీసుకుంటే కొత్త మంత్రివర్గ కూర్పు ముఖ్యమంత్రికి కత్తిమీద సామే! రాష్ట్రంలో మిగిలిన ప్రాంతాల విషయం పక్కనపెడితే, నెల్లూరుజిల్లాలో పదవి ఎవరిని వరించబోతోందన్న ఆసక్తి అటు పార్టీ శ్రేణులలోనూ ఇటు రాజకీయవర్గాల లోనూ కనపడుతోంది. ముఖ్యంగా జగన్‌మోహన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడైన మంత్రి మేకపాటి గౌతమ్ ఆకస్మిక మరణమే ఈ ఆసక్తికి మూలం. ప్రస్తుతం ఏర్పడబోయే క్యాబినెట్ ఖచ్చితంగా ఎన్నికల క్యాబినెట్ అయిఉండాలి. ముందుగా వెళ్తే మరో ఏడాదికో లేదంటే రెండేళ్లకో ఎన్నికలు వస్తాయి. ఇలాంటి సమయంలో ఎంతటి మేధావైనా ఆచితూచి అడుగేయాల్సిందే. నెల్లూరుజిల్లాలో ముందునుండీ వినపడుతున్న పేరు కాకాణి గోవర్ధన్‌రెడ్డిదే. అయితే ఒకవేళ గౌతమ్ జీవించి ఉండి ఉంటే ఆయనను తీసేసి కాకాణికి ఇస్తారా..? అన్న అనుమానం చాలా మందిలో కలిగింది. కానీ ఇప్పుడు గౌతమ్ లేరు, కాబట్టి కాకాణి పేరు పరిశీలనలో ముందువరుసలో ఉంటుంది. అయితే గౌతమ్ కుటుంబానికి న్యాయం చేసే క్రమంలో ఆయన సతీమణి శ్రీకీర్తికి అవకాశం ఇస్తారన్న వాదన కూడా బలంగా వినపడుతోంది. ముఖ్యమంత్రి సతీమణి భారతి కూడా శ్రీకీర్తి పేరునే బలంగా ప్రతిపాదిస్తున్నారని తాడేపల్లి సమాచారం. కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నరెడ్డి పేరు కూడా బలంగా వినపడుతోంది. జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ పెట్టకముందే తెలుగుదేశానికి టాటా చెప్పి రాజశేఖరరెడ్డి పంచన చేరిన తొలివ్యక్తిగా ప్రసన్నకి గుర్తింపు ఉంది. ప్రసన్నతో పోలిస్తే కాకాణి జూనియర్. పార్టీ అధికారంలోకి వచ్చేనాటికి కాకాణే జిల్లా అధ్యక్షుడు. అదొక్కటే ఆయనకు ప్లస్ పాయింట్. జిల్లాలో ఉన్న వర్గ రాజకీయాలను పరిశీలిస్తే కాకాణికి కొంతమందితో విభేదాలున్నాయి. ప్రసన్నకి అందరివాడన్న పేరుంది. ఈ ప్లస్‌లు మైనస్‌లు పార్టీ పరిగణలోకి తీసుకుంటుందా లేదా అన్నది ప్రశ్నార్థకమే. అసలు అలకలకి, వివాదాలకు తావు లేకుండా ఒక్క శ్రీకీర్తికే కిరీటం పెట్టి సరిపెట్టవచ్చుని కూడా రాజకీయ మేధావుల అంచనా. అప్పుడు పార్టీకి ఏ తలనొప్పి ఉండదన్నది వారి అభిప్రాయం. రెండవ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్‌ని మాత్రం కొనసాగించక పోవచ్చని రాజకీయవర్గాలు ముందునుండి ఊహించిందే. రాజకీయాలలో జూనియర్ అయినప్పటికీ ఒకసారి అవకాశం ఇచ్చారు కాబట్టి అనిల్‌కి పొడిగింపు ఉండదన్నది వారి అభిప్రాయం. ఎస్‌సి సామాజికవర్గంలో ప్రాధాన్యత ఇవ్వాల్సివస్తే కిలివేటి సంజీవయ్య మంత్రి కావడం ఖాయం అన్నది కూడా జిల్లా రాజకీయవర్గాల్లో బలంగా వినపడింది. ఆయనకు టీటీడీ పాలకమండలి సభ్యత్వం ఇచ్చారు కాబట్టి ప్రస్తుత పరిస్థితులలో సంజీవయ్య పేరు పరిశీలించే అవకాశాలు తక్కువే. ఇప్పుడు జిల్లా కూడా మారింది కాబట్టి తిరుపతి జిల్లాలో ఆశావహుల సంఖ్య కూడా ఎక్కువే. ఎవరికి దశ తిరగనుందో శ్రీరామనవమి పక్కరోజు వచ్చే దశమి వరకు వేచి చూడాల్సిందే...!

# చిన్నదైపోతున్న నెల్లూరు

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచ ప్రఖ్యాత పెలికాన్ పక్షులు, అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన చేనేత పరిశ్రమ, మైకా గనులు, సిలికా నిధులు అన్నీ ఇప్పుడు శ్రీ వేంకటేశ్వరుని సాక్షిగా తిరుపతి జిల్లాలో చేరిపోయాయి. నెల్లూరుని వదిలి వెళ్లిపోయాయి. పార్లమెంటు నియోజక వర్గాలను ప్రామాణికంగా తీసుకుని విభజన చేసుంటే సర్వేపల్లి కూడా చేజారిపోయి ఉండేది. అనేక కారణాలను, కోణాలను దృష్టిలోపెట్టుకుని సర్వేపల్లిని నెల్లూరు లోనే ఉంచేశారు.

రాష్ట్రంలో ఇప్పటివరకూ 13 జిల్లాలే ఉన్నాయి. ఏప్రిల్ 4వతేదీ నుండి అవి 26 కానున్నాయి. అదేరోజు ఉదయం ముఖ్యమంత్రి కొత్తజిల్లాలను లాంఛనంగా ప్రారంభిస్తారు. అప్పటినుండి ఆయా జిల్లాల కార్యకలాపాలు మొదలవుతాయి.

### చరిత్రాత్మక సంఘటన...

జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రయ్యాక న్యాయస్థానాల నుండి ఎలాంటి అభ్యంతరాలు లేకుండా అమలవుతున్న అతిపెద్ద ప్రక్రియ జిల్లాల పునర్విభజన. ఇది చారిత్రాత్మక సంఘటన. రాష్ట్రం ఉన్నంతవరకు 2022 ఏప్రిల్ 4వతేదీతో పాటు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేరు కూడా చిరస్థాయిగా నిలబడిపోతుంది. ప్రభుత్వం తీసుకునే ఎలాంటి నిర్ణయం లోనైనా భవిష్యత్తులో మరో ప్రభుత్వం ఏర్పడ్డాక మార్పులు చేయొచ్చు. కానీ జిల్లాల పునర్విభజనలో అది సాధ్యం కాదు. చరితార్థుడు జగన్.

# అమ్మవారి సేవలో శ్రీనివాసులు



గత పాతికేళ్ళకుపైగా రాజకీయాలలో తన సేవలందిస్తూ... రాజకీయ నిరుద్యోగిగా మిగిలిపోయిన ఆర్.శ్రీనివాసరావుకు ఎట్టకేలకు అమ్మవారి ఆశీస్సులు లభించాయి. నెల్లూరు గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఛైర్మన్‌గా ఆయన నియమితులయ్యారు. మార్చి 27వ తేదీ దేవస్థానం ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రావు శ్రీనివాసరావు(ఆర్‌ఎస్‌ఆర్)ను సత్కరిస్తున్న నెల్లూరురూరల్ శాసనసభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు వైసిపి రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి.

# నా కోసమే నాయకుడయ్యాడు

(మొదటి పేజీ తరువాయి)



మేకపాటి గౌతమ్‌రెడ్డి తల్లి మణిమంజరిని ఓదారుస్తున్న సీఎం జగన్

ఒకరోజు ముందుకూడా రాష్ట్రాభివృద్ధి కోసం దుబాయ్‌లో పర్యటించి వచ్చానని, అక్కడ జరిగిన విషయాలు, సాధించిన పెట్టుబడుల వివరాలను తనతో పంచుకోవాలని తనని కలవడం కోసం అపాయింట్‌మెంట్ కూడా తీసుకున్నాడని, అంతలోనే దేవుడు గౌతమ్‌ను తీసుకెళ్లిపోయాడని అన్నారు. తనతో పాటు వైసీపీ మొత్తం గౌతమ్ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మే లేదా జూన్ మాసంలో మళ్ళీ జిల్లాకి వచ్చి 'మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజ్'ని గౌతమ్ కుటుంబసభ్యుల సమక్షంలో ప్రారంభిస్తానని ప్రకటించారు.

రూరల్ శాసనసభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయనతో పాటు రాష్ట్ర మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్, జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, మేకపాటి రాజమోహన్‌రెడ్డిలు మాత్రమే ప్రసంగించారు.

### వీపీఆర్ సారధ్యంలో ఏర్పాట్లు

రాజ్యసభ సభ్యులు 'సేవాభూషణ్' వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి ప్రశాంతిరెడ్డిల సారధ్యంలో గొలగమూడిలోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాట్లు చేశారు. ముందుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మేకపాటి గౌతమ్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గౌతమ్ మాతృమూర్తి మణిమంజరిని, సతీమణి శ్రీకీర్తిని ఆయన ఓదార్చారు. వేదిక పైనున్నంత సేపూ ఆయన విషణ్ణవదనంతోనే ఉన్నారు. కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎంఎల్‌ఏలు, శాసనమండలి సభ్యులు, ప్రభుత్వంలోని పలు విభాగాల ఛైర్మెన్లు, పార్టీ విభాగాల అధ్యక్షులు, ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. సభా కార్యక్రమం అనంతరం సభకు విచ్చేసిన వేలాదిమంది వైసీపీ కార్యకర్తలకు, మేకపాటి కుటుంబ అభిమానులకు గౌతమ్ స్మృత్యంకంగా వేమిరెడ్డి దంపతులు విందు ఏర్పాటు చేశారు.

### హెలిపాడ్ వద్ద సందడి

మామూలుగా అత్యంత భద్రతా ఏర్పాట్ల మధ్య పర్యటించే జగన్మోహన్‌రెడ్డి, ఈసారి నిబంధనలను కొంత సడలించారు. ప్రతిసారీ హెలిపాడ్ వద్ద ముఖ్యమంత్రిని స్వాగతించడంతో పాటు కలిసేవారిని సైతం తాడేపల్లిలోని ముఖ్యమంత్రి కార్యాలయ ఆదేశానుసారం మాత్రమే పరిమిత సంఖ్యలో అనుమతించేవారు. ఇందుకోసం చాలామంది సిఫారసులకోసం ఎగబడేవారు. కలవలేని వారు నిరుత్సాహపడేవారు. అలాకాకుండా ఈసారి జిల్లాలోని చిన్నస్థాయి నాయకులను కూడా హెలిపాడ్ వద్దకు అనుమతించారు.

ముఖ్యమంత్రి హోదాలో ఉండి తన బాల్యస్నేహితుని స్మరించుకోవడం కోసం మూడవసారి వచ్చి 'స్నేహమేరా జీవితం – స్నేహమేరా శాశ్వతం' అన్న వాక్యాలకి అర్థం చెప్పిన జగన్‌కి హ్యాట్సాఫ్...!

# భక్తజన కోలాహలంగా.. ముత్యాలమ్మ జాతర



చిల్లకూరు మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో కొలువైవున్న ముత్యాలమ్మ అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. నాలుగురోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. గతనెల 28న గంగమిట్ట మీద ఘటం నిలిపి పోలేరమ్మ అమ్మవారిని తాటాకు కుటీరంలో ప్రతిష్టించారు. 29వ తేది పోలేరమ్మ నిలుపు వేడుకతో పాటు అమ్మవారికి బంగారు చీరను అలంకరించడంతో స్వర్ణకాంతులతో అమ్మవారు మెరిసి పోయారు. 30వ తేదీన యార గురునాథస్వామి, అంకమ్మ దేవతల గ్రామోత్సవం, గొల్లల వేడుకల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని వెండిచీరతో అలంకరించి, పుష్పాలంకరణ చేశారు. 31వ తేది ఉదయం గురునాథస్వామి గ్రామోత్సవం, రాత్రి అమ్మవారి ఉయ్యాలసేవ కన్నులపండువగా జరిగాయి. ఏప్రిల్ 1 శుక్రవారం నాడు పోలేరమ్మ అమ్మవారిని సాగనంపే ఉత్సవం నిర్వహిస్తారు. ఆలయ ఇఓ కోవూరు జనార్ధన్‌రెడ్డి, డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, సిఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తదితరులంతా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసి జాతరను పర్యవేక్షిస్తున్నారు.

# ఎమ్మెల్యే.. విద్యార్థిగా మారిన వేళ!..

**- పిహెచ్‌డి పరీక్ష రాసిన.. కాకాణి**



ఎప్పుడూ రాజకీయాల్లో బిజీగా ఉండే సర్వేపల్లి ఎమ్మెల్యే, వైఎస్సార్సీపి నెల్లూరు పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధనరెడ్డి విద్యార్థిగా మారి.. ఎంతో దీక్షతో పిహెచ్‌డి పరీక్ష రాసి తన ప్రత్యేకతను చాటుకున్నారు. గతనెల 29న ఆయన విక్రమసింహపురి విశ్వవిద్యాలయంలో జరిగిన పిహెచ్‌డి కోర్సు పరీక్షకు హాజరయ్యారు. అయితే ఎమ్మెల్యేగా ఎలాంటి హంగు ఆర్భాటం లేకుండా మామూలు విద్యార్థిలా వచ్చి పరీక్ష రాశారు. శాసనసభ్యునిగా ఎంతో పనివత్తిడితో ఉంటూ, సుమారు అయిదు పదుల వయసులో కూడా ఆయన విద్య పట్ల మక్కువతో ఇలా పరీక్షలు రాయడానికి రావడం అక్కడున్న అందరినీ ఎంతగానో ఆశ్చర్యపరచింది. 'రాష్ట్ర పంచాయతీరాజ్ వ్యవస్థలో చోటుచేసుకున్న మార్పులు - వాటి పరిణామాలు'.. అనే అంశంపై ఆయన పరిశోధన చేస్తున్నారు.

## ప్రైవేట్ పాఠశాలల వారు..

# ప్రవేశపరీక్షలు పెట్టకూడదు

ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల వారు విద్యార్థుల ప్రవేశాల కోసం ఎలాంటి పరీక్షలు పెట్టకూడదని డిఇఓ రమేష్ ఇటీవల ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆర్‌టిఇ-2009లో సెక్షన్ 13 (2) (బి)ని అనుసరించి ఈ నిబంధన ఉందని పేర్కొన్నారు. జిల్లాలో ఏ ఇతర పాఠశాలల యాజమాన్యాలు కూడా ఏ తరగతికి ప్రవేశ పరీక్షలు నిర్వహించరాదని, ఒకవేళ ఆ నిబంధన ఉల్లంఘించినట్లు తెలిస్తే మొదటిసారి 25వేలు, రెండవసారి తప్పిదానికి 50వేలు వంతున జరిమానా విధించడంతో పాటు పాఠశాల గుర్తింపును కూడా రద్దుచేస్తామని ఆయన హెచ్చరించారు.

# వందనం.. అభివందనం

**సాహితీశ్రీ మాదిరాజు శివలక్ష్మి**




నవ మాసాలు మోసి, తనువును పంచిన తల్లిగా..
ఓర్పుకు, నేర్పుకు, సహనానికి, త్యాగానికి
నిండైన రూపంగా నిలిచే మాతృమూర్తిగా..
స్వార్థాన్ని విడనాడి, అనుక్షణం తోడబుట్టిన వారి
సంతోషానికై ఆరాటపడే.. అక్కగా..
మగని ఉన్నతికై, అహరహం శ్రమించే.. అర్ధాంగిగా..
అత్తింటి వారి గౌరవ ప్రతిష్టలకు వన్నె తెచ్చేలా..
బాధ్యతాయుతమైన.. కోడలిగా..
కన్నవారి కలలకు సాకారమిస్తూ.. ఇంటి వెలుగులా..
కనుపాపగా కనిపెట్టుకుని ఉండే కూతురుగా..
సమాజ సేవలో 'నేనుసైతం' అంటూ
కరుణ రసం తొణికిసలాడే దయార్ద్రమూర్తిగా..
అన్యాయాన్ని ఎదిరించే ఆదిపరాశక్తిగా..
ఇలా అన్ని బంధాలతో.. అన్ని దశలలో..
మానవజాతి మనుగడకు ప్రాణం పోస్తున్న అతివలకు..
**'వందనం - అభివందనం'..**

# అమరావతిపై అంతుబట్టని జగన్ వ్యూహం!

ఆంధ్రప్రదేశ్‌లో పరిణామాలు 'రాజ్యాంగ సంక్షోభం' దిశగా కదులుతున్నాయా? రాష్ట్ర రాజధానిగా అమరావతి అనే విషయం చిలికిచిలికి గాలి వాన అవుతోందా?రాష్ట్ర హైకోర్టు... రాష్ట్ర ప్రభుత్వం అనే రెండు రాజ్యాంగవ్యవస్థల మధ్య అమరావతి వివాదంపై ఘర్షణ పరిస్థితులు చోటు చేసుకోబోతున్నాయా? ముఖ్యమంత్రి జగన్ అసెంబ్లీలో అభిప్రాయపడినట్లుగా హైకోర్టు తన పరిధి దాటి వ్యవహరించిందా? మరి హైకోర్టును పరిధుల లోపే ఉంచడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏమైనా చేయాలని అనుకుంటోందా? ఆంధ్రప్రదేశ్ శాసనసభే నేరుగా హైకోర్టుపై సుప్రీంకోర్టుకు ఫిర్యాదుచేస్తుందా? లేకపోతే, ఆ చర్చకు విలువ ఏముంటుంది? పోనీ శాసనసభ ఆవేదనను హైకోర్టు దృష్టికి తీసుకువస్తారా? మూడు రాజధానులే తమ విధానమని ముఖ్యమంత్రి జగన్ అసెంబ్లీలో ప్రకటించిన తరువాత... ఆ దిశగా ఎప్పుడు అడుగులు వేస్తారు? ఇప్పుడా..? వచ్చే ఎన్నికల తరువాతా?

రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లను మూడు నెలల్లో అప్పగించాలంటూ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పులో అప్పుడే ఒక నెల అయిపోవస్తోంది. ఇంకా రెండు నెలల వ్యవధే ఉంది. మాస్టర్‌ప్లాన్ ప్రకారం అమరావతిని తు.. చ... తప్పకుండా అభివృద్ధి చేయాలంటూ కోర్టు విధించిన ఆరు నెలల గడువు కూడా అయిదు నెలలకు వచ్చేస్తోంది కదా! ఈ పరిస్థితిని ప్రభుత్వం ఎలా హ్యాండిల్ చేస్తుంది? గడువు పెంచాలని హైకోర్టును ప్రభుత్వం కోరుతుందా? లేక సుప్రీంకోర్టుకు అప్పీల్‌కు వెళ్లి, హైకోర్టు తీర్పుపై స్టే తీసుకువస్తుందా? ఇక్కడ వ్యవధీ కోరకుండా... అక్కడి నుంచి స్టేనూ తీసుకురాకపోతే హైకోర్టు తీర్పు అమలులో ఉన్నట్టే కదా? జూన్ 3తో ఒక గడువు, సెప్టెంబర్ 3తో రెండో గడువు ముగుస్తుంది.






మరి, ప్రభుత్వం ముందు ఉన్న ప్రత్యామ్నాయం ఏమిటి? గడువులు దాటిన తరువాత హైకోర్టు ఏమి చేస్తుంది? 'కోర్ట్ ధిక్కరణ'పై చర్యలు చేపడుతుందా? ఈ వ్యవహారంలో 'కోర్టు ధిక్కరణ' అంటే ఏమిటి? అటువంటి పరిస్థితి తలెత్తుతుందా? రెండూ రాజ్యాంగ వ్యవస్థలే కదా...! మరి, వాటి మధ్య ఘర్షణ తలెత్తితే.. దానిని 'రాజ్యాంగ సంక్షోభం' అనవచ్చునా? ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం ఏం చేస్తుంది? ఆర్ఆర్ఆర్ సినిమాను సగటు ప్రేక్షకుడు నోరెళ్ళబెట్టి చూస్తూ కూర్చున్నట్లు.. కేంద్రం చూస్తూ కూర్చుంటుందా? 'ఇటువంటి తరహా' ఘర్షణను రాజ్యాంగ నిర్మాతలు ఊహించలేదా ?

హైకోర్టు విధించిన గడువు దాటిన తరువాత ఏం జరగబోతోంది? ప్రభుత్వ ప్రధానకార్యదర్శిని బాధ్యుల్ని చేస్తారా? లేకపోతే..., రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేయాల్సిందిగా రాష్ట్రపతికి సిఫారసు చేయాలని రాష్ట్ర గవర్నర్‌కు హైకోర్టు సిఫారసు చేస్తుందా? అసలు జగన్మోహనరెడ్డే అసెంబ్లీని రద్దుచేసి కొత్తగా ప్రజాతీర్పు కోరతారా?

అమరావతి విషయంలో సీఎం జగన్ వ్యూహం ఎవరికీ అంతుబట్టడం లేదు. అయితే, ఏ వ్యూహమూ లేకుండా మాత్రం ఆయన ఉండరని వైసీపీ సీనియర్ నేత ఒకరు అభిప్రాయపడ్డారు.

మూడు రాజధానులే ఎన్నికల అంశంగా ఆయన ద్విగుణీకృతోత్సాహంతో మళ్ళీ అధికారంలోకి వచ్చినప్పటికీ హైకోర్టు తీర్పు ప్రభావాన్ని ఎలా అధిగమిస్తారు? మూడు రాజధానుల 'కాన్సెప్ట్'ను ఎలా అమలు చేస్తారు? మరి, హైకోర్టు తీర్పును అధిగమించలేకపోతే 150సీట్లతో అధికారం చేపట్టినా... అంతకుమించిన సీట్లతో అధికారంలోకి వచ్చినా.. సుఖం ఏముంది !?

మరి, పరిష్కారం ఏమిటి?

నిజానికి, 'రాజధాని' వేరు, మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా అమరావతి నగర నిర్మాణం వేరు. ఈ రెండింటినీ విడదీసి... వేరువేరుగా చూస్తే సమస్య పరిష్కారం అవుతుందేమో ప్రభుత్వం పరిశీలించాలి. రాజధాని ఇప్పుడు వెలగపూడిలో 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సచివాలయం' పేరిట ఉన్న ప్రహరీగోడ లోపల ఉన్న అయిదు బ్లాకుల సముదాయం మాత్రమే. ఇందులోనే ముఖ్యమంత్రి ప్రభుత్వ ప్రధానకార్యదర్శి, వివిధ మంత్రిత్వ శాఖల కార్యదర్శులు, వారి వారి విభాగాలు, మంత్రుల కార్యాలయాలు ఉంటాయి. ఈ అయిదు బ్లాక్‌ల కాంప్లెక్స్ నుంచే రాష్ట్ర పాలన మొత్తం సాగుతూ ఉంటుంది. ప్రభుత్వ ఉత్తర్వులు (జీ.ఓలు) యావత్తు ఇక్కడినుంచే జారీ అవుతూ ఉంటాయి. ఈ భవనం రాష్ట్రంలో ఎక్కడ ఉంటే ఏమిటి? జన సామాన్యానికి ఈ భవనంతో పని ఏమిటి?

'రాజధాని నగరం' మాత్రం అమరావతే. కాకపోతే, పరిపాలనా కేంద్రం మాత్రం మరోచోట ఉంటుంది. మంత్రులు, ఉన్నతాధికారులు, అధికారులు, రాజకీయ నాయకులు, వారి పేరు చెప్పి బతికే వైట్ & వైటిలు, కాంట్రాక్టర్లు, రాజకీయబ్రోకర్లు మొదలైన వారికి తప్ప జన సామాన్యానికి పని లేని భవనం ఇది. అయిదు కోట్లకు పైబడి ఉన్న రాష్ట్ర జనాభాలో 99.99 శాతం మందికి ఈ భవనం అమరావతిలో ఉన్నదానికి అనకాపల్లిలో ఉన్నదానికి పేద్ద తేడా ఏమీ లేదు. ఏడాదికి 15, 20 రోజులు జరిగే అసెంబ్లీ సమావేశాల భవనం సచివాలయం ఉన్న ప్రాంతంలోనే ఉండాలనే నియమం ఏమీ లేదు. ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం, గవర్నర్ నివసించే రాజ్‌భవన్ మాత్రం పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా రాష్ట్ర సచివాలయానికి అందుబాటులో ఉండాల్సి ఉంటుంది. ఇక, రెండవది అమరావతి. ఇందులో ముప్పై వేల ఎకరాలకు పైబడి రైతులు ఇచ్చిన భూమి ఉంది. దీనిని ఎలా డెవలప్ చేయాలి అని నిర్దేశించే మాస్టర్‌ప్లాన్ ఉంది. రైతులకు ఇవ్వాల్సిన వాణిజ్య, నివాసప్లాట్‌లు ఉన్నాయి. ఎవరి ప్లాట్ వారికి ఇచ్చేసి, పీపీపీ పద్ధతిలో మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా నగర నిర్మాణానికి అనుగుణమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రపంచస్థాయి నిర్మాణ సంస్థలను ఆహ్వానిస్తే ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి కోరిక తీరుతుంది... భూములిచ్చిన రైతుల కోరికా తీరుతుంది. అయితే, ఇది రోజులలోనో.. కొన్ని నెలల్లోనో ఒక కొలిక్కి వచ్చే అంశం కాదు. ఈలోపు 'కాలం' తరుముకుంటూ వచ్చేస్తుంది కదా!

'రాజ్యాంగ సంక్షోభం... రాజ్యాంగ సంక్షోభం...' అని అనుకోవడమే గానీ అది ఏమిటో... వస్తే ఎలా ఉంటుందో మన జనాలకు తెలియదు. 1956లో తెలుగు భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత, ఎప్పుడూ రాజ్యాంగ సంక్షోభం అనేది మన రాష్ట్రంలో ఏర్పడలేదు. అందుకే ఇప్పుడు ఈ హైకోర్టు తీర్పును జగన్ ప్రభుత్వం పట్టించుకోకపోతే... ఏం జరుగుతుందనే అంశంపై రాష్ట్రంలో అమితాసక్తి వ్యక్తమవుతోంది. పట్టించుకోకుండా జగన్ ఉండరని, అయితే.. ఎలా అనేది తెలియడం లేదని ఒక ఉన్నతధికారి వ్యాఖ్యానించారు. మామూలుగా ఏ రాష్ట్రంలో అయినా అధికారపక్షానికీ... ప్రతిపక్షాలకూ మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడుతుంది. ఒకదానిపై మరొకటి పైచేయి సాధించడానికి చూస్తుంటాయి. మన రాష్ట్రంలో మాత్రం పరిస్థితి ప్రత్యేకం. అమరావతి విషయంలో న్యాయవ్యవస్థకు.. రాష్ట్ర ప్రభుత్వం ఎదురొడ్డి నిలబడిందనే భావం కలుగుతోంది. కాగలకార్యం గంధర్వులే తీర్చారన్నట్లుగా.. తమకు శ్రమ, భారం తగ్గాయని ప్రతిపక్షాలు ఊపిరి పీల్చుకుంటున్నాయి.

మన దేశ రాజ్యాంగం ప్రకారం, కోర్టుల పరిశీలనకు వచ్చిన ఏ అంశంలో అయినా వాటి ఆదేశాలను ఏ వ్యవస్థ అయినా శిరసావహించవలసిందే. మరో మార్గం లేదు. మరి, జగన్ మనసులో ఏముంది?

**- భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com

# జెన్‌కో ప్రైవేటీకరణ యత్నాలను ఆపండి - ఎమ్మెల్సీ విఠపు

ముత్తుకూరు మండలం నేలటూరులో ఉన్న జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ప్రైవేటీకరణ చేసే యత్నాలను ప్రభుత్వం వెంటనే నిలుపుదల చేయాలని, జెన్‌కోను ప్రైవేటీకరించి కార్మికుల కడుపులు కొట్టద్దని ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం కోరారు. గతనెల 29న ఆయన ఏపి జెన్‌కో ఎదుట విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కార్మికులు చేస్తున్న నిరసనలకు మద్దతు తెలిపారు. దాదాపు రెండునెలలకు పైగానే కార్మికులు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని, ప్రభుత్వరంగ సంస్థ అయిన జెన్‌కోను ప్రైవేట్‌కు అప్పగించాలనుకోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కార్మికులు ఆందోళనలు చేస్తుంటే ఉద్యమాన్ని నీరుగార్చేందుకు వారిపై ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని, ఇష్టం వచ్చినట్లుగా బదిలీలు చేస్తోందని, అయితే అందువల్ల ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు.

## ఢిల్లీ శ్రీవారి ఆలయంలో స్వామివారు, అమ్మవార్లకు స్వర్ణ తాపడ ఆభరణాలు సమర్పించిన వేమిరెడ్డి దంపతులు



మార్చి 30వతేదీ బుధవారం నాడు దేశ రాజధాని కొత్త ఢిల్లీలోని గోల్ మార్కెట్లో ఉన్న శ్రీవారి ఆలయంలో స్వర్ణ తాపడ ఆభరణాలను వేమిరెడ్డి దంపతులు అందించారు. శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి, పద్మావతి, గోదాదేవి అమ్మవార్లకు శంఖు, చక్రం, కిరీటం, అభయవరద హస్తాలు, సూర్యకఠారి, పద్మపీఠం, మకర తోరణాలతో పాటు మరికొన్ని స్వర్ణ తాపడ ఆభరణాలను రాజ్యసభసభ్యులు 'సేవాభూషణ్' వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఆయన సతీమణి తిరుమల తిరుపతి దేవస్థానాల స్థానిక సలహా మండలి ఛైర్‌పర్సన్ ప్రశాంతిరెడ్డిలు అందజేశారు. శుభకృత్ నామ తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకుని దేవస్థానాల అదనపు ఈఓ ధర్మారెడ్డి దంపతుల సమక్షంలో వారు ఈ ఆభరణాలను సమర్పించారు.



## ఉభయ సభల్లో మనోళ్ళు



ఢిల్లీ సభలలో అటు లోక్‌సభలోను ఇటు రాజ్యసభలోనూ మనోళ్లు ప్రశ్నల శరపరంపర కురిపిస్తున్నారు. అనేక పథకాలకు సంబంధించిన అంశాలపై వివరాలు అడుగుతూ సంబంధిత శాఖల అధికారులు, కేంద్రమంత్రుల నుంచి సమాధానాలు రాబడుతున్నారు. నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలు ఉభయసభలలో నెల్లూరు వాణిని వినిపిస్తూ దేశానికి సంబంధించిన అంశాలతోపాటు జిల్లాకు చెందిన విషయాలను కూడా ప్రస్తావిస్తుండడం విశేషం.

### నెల్లూరులో ఎన్ని ఫ్లైఓవర్లు కడుతున్నారు?

**- ఆదాల**

నెల్లూరు నగరంలో, నగర శివార్లలో కేంద్రప్రభుత్వం ఎన్ని ఫ్లై ఓవర్లు కట్టాలని భావిస్తోంది?.. అందుకు ఎంత కేటాయించారు?.. ఆ వివరాలు చెప్పండంటూ నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి మార్చి30న పార్లమెంట్‌లో ప్రశ్నించారు. అందుకు కేంద్ర రైల్వే సమాచారశాఖ మంత్రి అశ్విన్‌వైష్ణవ్ రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. నెల్లూరు జిల్లాలో 55 లెవల్‌క్రాసింగ్‌లు ఉంటే అందులో 15 క్రాసింగ్‌ల వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు, అండర్ బ్రిడ్జిలు మంజూరయ్యాయని తెలిపారు. నెల్లూరు నగరంలో 4 లెవల్ క్రాసింగ్‌లు ఉన్నాయని, వాటిలో రెండు ఓవర్‌బ్రిడ్జిలకు కేంద్రం తనవంతు నిధులు మంజూరుచేసిందని, మరో రెండు క్రాసింగ్‌లు రైల్వేయార్డులో ఉన్నాయని, అక్కడ రైల్వే ఓవర్‌బ్రిడ్జి, అండర్‌బ్రిడ్జిల నిర్మాణానికి భాగస్వామ్య ప్రాతిపదికన అర్హత పొందాయని, అయితే దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంతవరకు ఎలాంటి ప్రతిపాదన అందలేదన్నారు.

### ఫిషింగ్ హార్బర్‌ను ఎప్పటికి పూర్తిచేస్తారు?

**- వేమిరెడ్డి**

నెల్లూరుజిల్లాలోని జువ్వలదిన్నెలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణాన్ని ఎప్పుడు ప్రారంభించారు, అది ఎప్పటికి పూర్తవుతుంది..? అని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మార్చి 29న పార్లమెంట్‌లో ప్రశ్నించారు. విపిఆర్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి సర్బనంద సోనోవల్ సమాధానమిస్తూ సదరు ప్రాజెక్టు 2020లో కన్వర్జెన్సీ మోడ్ ఆఫ్ ఇంప్లిమెంటేషన్‌లో నీలివిప్లవంపై సెంట్రల్ సెక్టార్ స్కీం క్రింద మంజూరు చేయబడిందని, సంబంధిత రంగానికి చెందిన పలు మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో ఈ హార్బర్ నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ఆ ప్రాజెక్టు మొత్తం వ్యయం 288.8 కోట్లలో, కేంద్రప్రభుత్వం 144.4కోట్లు కేటాయించిందని తెలిపారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి ఇది పూర్తవుతుందని, ప్రస్తుతం ప్రాజెక్టు పనులు జాప్యం లేకుండా జరుగుతున్నాయని ఏపి ప్రభుత్వం తెలియజేసిందని ఆయన విపిఆర్‌కు వివరించారు.

## జిల్లా ఎస్పీతో ఆనం రామనారాయణరెడ్డి భేటి



మాజీమంత్రి, వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి జిల్లా ఎస్పీ విజయారావుతో భేటీ అయ్యారు. మార్చి 31వ తేదీ గురువారం ఉదయం ఆయన క్యాంపు కార్యాలయంలో ఎస్పీని కలిసి నూతన జిల్లాల ఏర్పాటు ప్రక్రియలో భాగంగా అవసరమున్న పోలీస్‌స్టేషన్‌ల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు.

## కాంగ్రెస్ వల్లే రాజ్యసభకు రాగలిగాను


### విజయసాయిరెడ్డి ఛలోక్తి

కాంగ్రెస్‌పార్టీ తమ మీద తప్పుడు కేసులు బనాయించడం వల్లనే తాను రాజ్యసభకు రాగలిగానని వైఎస్సార్సీపీ సభ్యులు వి.విజయసాయిరెడ్డి ఛలోక్తి విసిరారు. ఆయనతోపాటు రానున్న రెండు నెలల్లో పదవీ విరమణ చేస్తున్న 72 మంది రాజ్యసభ సభ్యులకు వీడ్కోలు పలికేందుకు గురువారం రాజ్యసభలో జరిగిన ప్రత్యేక సమావేశంలో సాయిరెడ్డి మాట్లాడారు. రాజ్యసభ ఛైర్మెన్‌గా క్రమశిక్షణ, విలువలను, సభా మర్యాదను కాపాడేందుకు కృషిచేస్తున్న గౌరవనీయులు వెంకయ్య నాయుడి నాయకత్వంలో సభలో సభ్యుడిగా కొనసాగడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

## 'ముస్లింల సమరభేరి'లో సోమిరెడ్డి



వైసిపి పాలనలో ముస్లింలపై జరుగుతున్న దాడులను ఖండిస్తున్నాం... ప్రభుత్వంపై సమరభేరి మోగిస్తాం... అంటూ మార్చి 31వ తేదీ నెల్లూరులోని సిపిఆర్ కళ్యాణ మండపంలో ముస్లిం సోదరులు ఏర్పాటు చేసిన 'సమరభేరి' కార్యక్రమంలో పాల్గొని ముస్లిం సోదరులకు మద్దతుగా భేరి మోగిస్తున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com